మంగళవారం 21 ఏప్రిల్ 2026

https://www.telugudesam.org

# చైతన్యరథం


సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ఆప్త మిత్రునికి శుభాభినందనలు

5

● ఈ చిరునవ్వులే.. రాష్ట్రానికి సిరులు



ఏపీ సీఎం చంద్రబాబు తన పుట్టిన రోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరితో కలిసి కేక్ కట్ చేశారు. "జీవితంలో మరో ఏడాది పూర్తి చేసుకుంటున్న వేళ.. ఎప్పటికీ అండగా నిలిచే జీవిత భాగస్వామితో కలిసి నా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటున్నా. ఆమె సహకారం, ఆప్యాయతవల్లే జీవితం మరింత అర్థవంతంగా మారుతోంది" అని చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## మహిళలను ఓడించిన

# డీఎంకేను ఓడించండి

3

- ఇండి కూటమి నిర్వాకంతో దక్షిణాదికి తీరని నష్టం
- డీఎంకే పాలనలో తమిళనాడు అభివృద్ధి కుంటుపడింది
- డబులింజన్ సర్కార్‌తోనే తమిళనాడు అభివృద్ధి సాధ్యం
- నదుల అనుసంధానం జరిగితే తమిళనాడుకూ లబ్ధి
- జయలలిత పాలన కోసం ఎన్డీయేను గెలిపించాలి
- కోయంబత్తూరు ఎన్నికల సభలో ఏపీ సీఎం పిలుపు

మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకుని డీఎంకే సహా ఇండీ కూటమి భాగస్వామ్య పక్షాలు చారిత్రక తప్పు చేశాయి. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగేది. డీఎంకే సహా ఇండి కూటమి తీసుకున్న తప్పుడు నిర్ణయంవల్ల మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉద్దేశపూర్వకంగా మహిళలను ఓడించిన డిఎంకేకు బుద్ధి చెప్పాలంటే.. ఆ పార్టీని ఓడించి ఇంటికి పంపడం ఒక్కటే మార్గం. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి సాధ్యమైంది. ఇక్కడా ఎన్డీయేను గెలిపిస్తే అటువంటి అభివృద్ధి సాధ్యమవుతుంది. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించండి.

### డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ డెవలప్‌మెంట్

4



అన్నానగర్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల క్యాంపెయిన్. ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన రోడ్ షో. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

## అన్న వితరణకు అన్నక్యాంటీన్లు వేదిక

- అందరి ఆకలి తీరుద్దామని ముఖ్యమంత్రి పిలుపు
- స్వయంగా వడ్డించిన చంద్రబాబు దంపతులు



2

● ఈ అదృష్టం నాదే..



"ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. స్ఫూర్తిదాయక నాయకులైన మిమ్మల్ని 'నాన్న'గా పిలిచే అదృష్టం నాకు దక్కింది. ఏళ్లు గడిచే కొద్దీ ప్రజాసేవపై మీ తపన మరింత బలపడుతోంది. అనుభవం, దూరదృష్టితో రాష్ట్రాన్ని ముందుండి నడిపిస్తున్న తీరు ఆదర్శప్రాయం. కష్టసమయంలో పట్టుదల, ప్రజలపట్ల మీ అంకితభావం మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా"


-నారా లోకేష్, విద్యా మంత్రి



## చేతలు చూపిన మహా సాయం!

- పుట్టినరోజు సందర్భంగా సీఎంఆర్‌ఎఫ్ ఫైలుపై సీఎం సిగ్నేచర్
- సహాయ నిధినుంచి రూ.56 కోట్ల విడుదలకు సంతకం
- 22 నెలల్లో అభాగ్యులకు రూ.1,298 కోట్ల ఆర్థిక సాయం

4



# అన్న వితరణకు అన్నక్యాంటీన్లు వేదిక



- **కడపుమంటతోనే అన్న క్యాంటీన్లు మూసేసిన గత ప్రభుత్వం**
- **అందరి ఆకలి తీరుద్దామని సీఎం చంద్రబాబు పిలుపు**
- **పుట్టినరోజున క్యాంటిన్‌లో స్వయంగా వడ్డించిన సీఎం దంపతులు**

అమరావతి (చైతన్య రథం): సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అన్నదానం అన్నిటికంటే పవిత్రమైందని, ఇందులో ఎవరికి తోచిన విధంగా వారు భాగస్వాములు కావొచ్చన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి విజయవాడలోని పటమట అన్న క్యాంటీన్‌కు ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి వెళ్లారు. క్యాంటీన్‌కు అల్పాహారం నిమిత్తం వచ్చేవారికి స్వయంగా ఇరువురూ వడ్డించారు. అనంతరం సీఎం చంద్రబాబు, భువనేశ్వరి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.... "అన్నవితరణకు శక్తిమేరకు ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు. అన్నదానంలో అందరూ భాగస్వాముల కావాలని పిలుపునిస్తున్నా. ఎవర్నీ బలవంతం చేయడం లేదు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదు. ఆంధ్రప్రదేశ్ అంటేనే అన్నపూర్ణ... దేశానికి అన్నంపెట్టిన రాష్ట్రం మన ఏపీ. అన్న క్యాంటీన్లలో పేదల ఆనందం చూస్తే చాలా సంతృప్తినిచ్చింది. పటమట అన్న క్యాంటీన్ చాలా పరిశుభ్రంగా ఉంది. పేదలు మూడు పూటలా భోజనం చేసే అవకాశం క్యాంటీన్లలో లభిస్తోంది. రూ.5లకే మంచి ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, పేదలు బయట భోజనం చేయాలంటే రూ.100 చెల్లించాలి. అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌తో ఆహారం ఎంతో రుచిగా, నాణ్యతతో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు' అని అన్నారు.

**అన్నం పెట్టేవారిని అరెస్ట్ చేశారు**

'గత ప్రభుత్వం దుర్మార్గంగా అన్న క్యాంటీన్లను మూసేసింది. భోజనం పెడతామంటే తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారు. ఇది వారి ఆలోచనా విధానానికి నిదర్శనం. పేదలు కడుపునిండా అన్నం తింటే భరించలేని వారు రాజకీయాల్లో ఉన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేసేందుకు వారికి మనసెలా వచ్చిందో..? అలాంటి వారు రాష్ట్రాన్ని పాలించారంటే ప్రజలు ఆలోచించుకోవాలి. ప్రజా ప్రభుత్వం వచ్చాక అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయి. ఇటీవల 62 ప్రారంభించాం. ఇంకో 5 క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. గౌరవంగా పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకునేందుకు అన్న క్యాంటీన్లకు శ్రీకారం చుట్టాం. భువనేశ్వరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నా పుట్టిన రోజు సందర్భంగా అన్న క్యాంటీన్ల ఒక రోజు నిర్వహణకు రూ.76 లక్షల విరాళాన్ని అందించి స్ఫూర్తిగా నిలిచారు. ప్రభుత్వం అన్నం పెట్టలేక కాదు... కానీ అన్న క్యాంటిన్లను స్ఫూర్తికి వేదికగా మార్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరుతున్నాం. ఇది ఒక ప్రజా ఉద్యమంలా మారాలి. అన్న క్యాంటీన్‌లు కూడా పీ4లో భాగమే. పీ-4లో భాగంగా అట్టడుగునున్న 20శాతం మందిని 10 శాతం మార్గదర్శులు ఆదుకోవాలని కోరుతున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**భోజనం ఎలా ఉంటోంది?: సీఎం చంద్రబాబు**

పటమట అన్న క్యాంటీన్‌లో అందరితో కలిసి అల్పాహారం తీసుకున్న సీఎం చంద్రబాబు... అక్కడవారిని భోజనం నాణ్యత, రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ రోజూ పరిశుభ్రంగా ఉంటుందా? అని అడగ్గా పరిశుభ్రంగానే ఉంటుందని వారు బదులిచ్చారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలు గురించి చర్చించారు. ఆటో డ్రైవర్ సేవలో, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఇతర సూపర్ సిక్స్ పథకాలపై అభిప్రాయం తెలుసుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా భువనేశ్వరి అన్న క్యాంటీన్లకు విరాళం అందించారని... సంపాదనలో మీరూ భువనేశ్వరిని ఆదర్శంగా తీసుకోవాలని సీఎం వ్యాఖ్యానించారు. అన్న క్యాంటీన్‌లో అల్పాహారం అనంతరం అక్కడివారితో కలిసి సీఎం చంద్రబాబు, భువనేశ్వరి ఫోటోలు దిగారు.









# మహిళలను ఓడించింది..

# డీఎంకేనూ ఓడించండి




- **ఇండి కూటమి నిర్వాకంతో దక్షిణాదికి తీరని నష్టం**
- **డీఎంకే పాలనలో తమిళనాడు అభివృద్ధి కుంటుపడింది**
- **డబులింజన్ సర్కార్‌తోనే తమిళనాడు అభివృద్ధి సాధ్యం**
- **నదుల అనుసంధానం జరిగితే తమిళనాడుకూ లబ్ధి**
- **జయలలిత పాలన కోసం ఎన్డీయేను గెలిపించాలి**
- **కోయంబత్తూరు ఎన్నికల సభలో ఏపీ సీఎం పిలుపు**
- **తమిళనాడులో రెండురోజుల ఎన్నికల పర్యటన**
- **తన ప్రసంగంలో తమిళంతో ఆకట్టుకున్న చంద్రబాబు**

తమిళనాడు/ కోయంబత్తూరు (చైతన్య రథం) మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీఎంకే వ్యతిరేకంగా ఓటేసి మహిళలకు తీరని అన్యాయం చేసిందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేసి మహిళలకు... డీలిమిటేషన్ బిల్లును అడ్డుకుని దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్, డీఎంకే సహా ఇండి కూటమి పార్టీలు పెద్దఎత్తున నష్టాన్ని కలిగించాయని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం మంచి ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లులను అడ్డుకోవడం ద్వారా ఇండి కూటమి పార్టీలు చేసిన తప్పిదాన్ని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల అభ్యర్థుల తరపున రెండు రోజులపాటు ప్రచారం చేసేందుకు ఏపీ సీఎం చంద్రబాబు సోమవారంనుంచి తమిళనాడులో పర్యటిస్తున్నారు. అమరావతి నుంచి నేరుగా తమిళనాడులోని కోయంబత్తూరుకు చేరుకున్నారు. అక్కడ ఓ ప్రయివేట్ హోటల్లో కోయంబత్తూర్ నగరంలోని వివిధ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సీఎం సమావేశమయ్యారు. సమావేశానికి కోయంబత్తూరులోని వివిధ నియోజకవర్గాలనుంచి పోటీ చేస్తున్న ఎన్డీయే అభ్యర్థులు హాజర్యయారు. కోయంబత్తూరు నార్త్‌నుంచి పోటీ చేస్తున్న వానతి శ్రీనివాసన్, కోయంబత్తూరు సౌత్‌నుంచి పోటీ చేస్తున్న అమ్మన్ కే.అర్జున్, సింగనల్లూర్‌నుంచి పోటీ చేస్తున్న కేఆర్ జయరామన్, కౌండంపాలాయం నుంచి పోటీ చేస్తున్న అరుణ్‌కుమార్, సూలూర్‌నుంచి పోటీ చేస్తున్న కందస్వామి సమావేశానికి హాజరయ్యారు. ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. తమిళనాడుతో ఏపీకి... ఎన్టీఆర్‌కు, తనకు ఉన్న అనుబంధాన్ని సమావేశంలో వివరించారు. ఎన్టీఆర్ హయాంలోనే తెలుగు గంగ ద్వారా చెన్నైకు నీరిచ్చామని... నదుల అనుసంధానం జరిగితే... గోదావరి నీళ్లను తమిళనాడుకు ఇవ్వవొచ్చని సీఎం చంద్రబాబు చెప్పారు. నదుల అనుసంధానానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని... ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్‌వల్లే అభివృద్ధి జరుగుతోందని, పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకుని డీఎంకే సహా ఇండీ కూటమి భాగస్వామ్య పక్షాలు తప్పు చేశాయన్నారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగేదని చెప్పారు. డీఎంకే సహా ఇండి కూటమి తీసుకున్న తప్పుడు నిర్ణయంవల్ల మహిళలకు, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలిగిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత మీడియా సమావేశంలోనూ వివిధ అంశాలపై స్పందించారు.

### మనమంతా ద్రవిడులం

తమిళనాడు.. ఆంధ్రప్రదేశ్ వేర్వేరు రాష్ట్రాలు అయినా... మూలాలు ఒకటేనని... అందరదీ ద్రవిడ సంస్కృతేనని సీఎం చంద్రబాబు అన్నారు. పాండ్యులు, చోళులు పాలించిన నేల తమిళనాడు. అత్యంత ప్రాచీన భాష తమిళమని అన్నారు. "తల్లి భాషను తమిళులు ప్రేమించినంతగా ఎవరూ ప్రేమించలేరు. కోయంబత్తూరు అత్యంత ప్రముఖ వాణిజ్య, పారిశ్రామిక కేంద్రం.

క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే మనస్తత్వమే తమిళ సోదరుల విజయరహస్యం. ఏ రంగంలోనైనా తమిళ సోదరులు విజయం సాధిస్తారు. సుబ్రమణ్య భారతి, కణ్ణగి, తిరువళ్లవర్, సీవీ రామన్, అబ్దుల్ కలాం ఆజాద్‌లాంటి ఎంతో మంది ప్రముఖులు ఈ గడ్డనుంచే వచ్చారు. ఇక్కడ ఉన్నంత సుందరమైన పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఇంకెక్కడా లేవు. రామేశ్వరం, తంజావూరు, అరుణాచలంలాంటి దివ్యక్షేత్రాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడానికి కుప్పంలో ద్రవిడ యూనివర్సిటీనే ఏర్పాటు చేశాం. తమిళనాడుతో తెలుగు వారికి మంచి సంబంధాలే కొనసాగుతున్నాయి. ఈ గడ్డపైనుంచే ఎన్టీఆర్ ఓ మహానాయకుడిగా ఎదిగారు. ఎన్టీఆర్ -ఎంజీఆర్ మధ్య మంచి స్నేహం ఉంది. నా వివాహం కూడా చెన్నైలోనే అయ్యింది" అని చంద్రబాబు అన్నారు.

### కీలక బిల్లులను అడ్డుకుని డీఎంకే తప్పు చేసింది

"తమిళనాడుకు నీటిని తీసుకురావడానికి ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టును తీసుకువచ్చారు. నేను ప్రాతినిధ్యం వహించే కుప్పంలోనూ తమిళం మాట్లాడే వారే ఉన్నారు. జాతీయ రహదారులు అనుసంధానం అయినట్టే గంగ- కావేరి నదులు అనుసంధానం కావాలి. నీటి భద్రతవస్తే దేశానికి శ్రీరామ రక్ష అవుతుంది. ముందుగా రాష్ట్రాల్లో అంతర్గతంగా నదులు కలిపితే... దేశంలో ఇతర నదుల అనుసంధానం జరుగుతుంది. గోదావరి-కావేరీ నదులు అనుసంధానమైతే ఆ తర్వాత క్రమంగా మిగతా నీటీ వనరులు కలిసే అవకాశం ఉంటుంది. శ్రీలంకలోనూ తమిళులు కాంగ్రెస్ కారణంగా ఇబ్బందులు పడ్డారు. అన్నాడీఎంకే అంటే గుర్తు వచ్చేది జయలలితే. మళ్లీ గెలిచేది ఏఐఏడీఎంకే-బీజేపీ కూటమే. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు ఇవ్వాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. కానీ డీఎంకే, టీఎంసీ, కాంగ్రెస్‌లాంటి పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవటం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని డీఎంకే మహిళలకు ద్రోహం చేసింది. మహిళల ప్రాతినిధ్యం కోసం అదనంగా సీట్లు పెంచే ప్రయత్నం జరిగింది. మహిళలకు సీట్లు పెరిగితే ఇండి కూటమికి ఎందుకు అడ్డుకుందోననేది ప్రజలంతా ఆలోచించాలి. మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు వ్యతిరేకించిందో డీఎంకే సమాధానం చెప్పాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం చాలా కాలంగా నాలాంటి వ్యక్తులు పోరాడుతున్నారు. 2029 ఎన్నికలకే ఈ రిజర్వేషన్ అమలు కావాలని ప్రధాని మోదీ భావించారు. గడచిన 30 ఏళ్లుగా మహిళలు తమకు 33 శాతం రిజర్వేషన్ వస్తుందని ఎదురు చూస్తున్నారు. దేవెగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ వ్యతిరేకించింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించటం అనేది దేశానికి ఓ ప్రగతిశీల విధానం. దీనిని అడ్డుకోవటం ద్వారా కాంగ్రెస్ మహిళా సాధికారితను అడ్డుకుంది. ఇండి కూటమి పార్టీలు మహిళలకు సమాధానం చెప్పాలి. దేశంలో సగం జనాభా మహిళలే. ఈ విషయాన్ని ఇండి కూటమి పార్టీలు ఎందుకు గుర్తించటం లేదు..? మహిళా బిల్లు వీగిపోయేలా చేసిన ఇండి కూటమి ఎన్డీఏ ఓడించలేదు. మహిళలను ఓడించింది. రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న మహిళల్ని డీఎంకేవంటి పార్టీలు నిరాశ పరిచాయి. కాంగ్రెస్ -డీఎంకే రాజకీయాల కారణంగా మహిళలు ఓడిపోయారు. మహిళలకు రిజర్వేషన్లు అవసరం లేదని డీఎంకే కోరుతోందా...? దక్షిణ భారతదేశానికి డీలిమిటేషన్‌లో సీట్లు పెరగవని అపోహ సృష్టించారు. కనీసం 50శాతం మేర సీట్లు పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన వాటాను రాకుండా డీఎంకే అడ్డుకుంది. 50 శాతం సీట్లు పెరుగుతాయని స్పష్టంగా చెబుతుంటే ఇబ్బంది ఏమిటి..? గతంలో జనాభా లెక్కల ప్రాతిపదికనే డీలిమిటేషన్ ప్రక్రియ చోటుచేసుకుంది. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ బిల్లువల్ల తమిళనాడు, ఏపీ, కేరళ, తెలంగాణ, కర్ణాటకలాంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగి ఉండేవి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగాలని డీఎంకే కోరుకుంటోందా..? 2027 సెన్సెస్ ప్రకారం చేస్తే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. కొన్ని పార్టీలు సంస్కరణలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. డీఎంకే తీసుకున్న నిర్ణయంవల్ల మహిళలు నష్ట పోయారు. దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయాయి" అని ఏపీ సీఎం వివరించారు.

### ఎన్డీఏతోనే తమిళనాడుకు పూర్వవైభవం

"గతంలో తమిళనాడు ఓ బలమైన ఆర్థిక వ్యవస్థ. ఇప్పుడు పరిస్థితి ఏమిటన్నది తమిళ ప్రజలే అంచనా వేయాలి. తమిళనాడుకు పూర్వవైభవం రావాలంటే ఎన్డీఏ అభ్యర్థులకే ఓటు వేయాలి. ఐదేళ్లఏళ్లపాటు మేం అధికారంలో లేనప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఓ పార్టీ విధ్వంసం చేసింది. 2024లో డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వచ్చింది... 22 నెలల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. గడచిన ఐదేళ్లుగా చెన్నై అభివృద్ధి ఆగిపోయింది. తమిళ ప్రజలకు ప్రయోజనాలు అందటం లేదు. సంస్కరణలతో ముందుకు వెళ్తేనే భవిష్యత్తు ఉంటుంది. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం చేయూతతోనే అభివృద్ధి, పెట్టుబడులు సాధించగలుగుతున్నాం. 15 బిలియన్ డాలర్లతో గూగుల్ పెట్టుబడి ఆంధ్రప్రదేశ్ కు వచ్చింది. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీని కూడా ఏర్పాటు చేయబోతున్నాం. కేంద్రం సహకరిస్తున్నా డీఎంకే దానిని వినియోగించుకోవటం లేదు. తమిళనాడుకు అప్పులు పెరిగాయి... యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. తమిళనాడులో చాలా కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. డీఎంకే హయాంలో నేరాల రేటు బాగా పెరిగిపోయింది. తమిళ ప్రజల మధ్య విభేధాలు, విద్వేషాలను తీసుకువచ్చారు. తమిళనాడుకు కేంద్రం లక్షల కోట్ల రూపాయలను అందించింది. సాగర్‌మాల కింద రూ.93 వేల కోట్లను వ్యయం చేశారు. ఎన్డీఏలో భాగస్వామిగా చాలా కాలంగా పనిచేస్తున్నాం... సరైన సమయంలో సరైన నేతగా ప్రధాని మోదీ ఉన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. గతంలో చెన్నై ఉమ్మడి రాజధానిగా ఏపీ తమిళనాడు కలిసే ఉన్నాయి. ఇప్పుడు చెన్నై వెనుకపడిపోయింది. జయలలిత స్థాపించిన ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి గెలవాలి. అభివృద్ధి సాధించాలి. అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలందరినీ కోరుతున్నాను. జాతి ప్రయోజనాల కోసం, జాతి నిర్మాణం కోసం ఎన్డీఏ గెలవాలి. డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తే ప్రగతి అంటే ఏమిటో మీరే చూస్తారు" అని ముఖ్యమంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి తమిళనాడు పర్యటనలో కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడుకు చెందిన బీజేపీ, అన్నాడీఎంకే సహా ఎన్డీఏ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.


### తమిళ పదాలతో సీఎం చంద్రబాబు ప్రసంగం

కోయంబత్తూరులో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో మధ్య మధ్యలో తమిళ పదాలను ఉపయోగించారు. తమిళంలో కొన్ని పదాలు వాడారు. అనైవరుక్కుం వణక్కం... ఎన్ అన్బాన తమిళ్ నాడు మక్కళే, ఉంగళుడన్ ఎన్ పిరందనాళ్లిల్ ఇంగే ఇరుప్పదు రొంబవే సంతోషం.(అందరికీ నమస్కారం... నా ప్రియమైన తమిళనాడు ప్రజలారా, నా పుట్టినరోజు రోజున మీతో ఇక్కడ ఉండటం చాలా సంతోషంగా ఉంది.) అంటూ తన పుట్టిన రోజున తమిళనాడుకు రావడం సంతోషంగా ఉందంటూ తమిళ భాషలో చెప్పారు. అలాగే మున్నేట్రం వేణ్డుమా... వేలైవాయుప్పు గళ్ వేణ్డుమా... అప్పుడియానాల్ మధ్యతిల్ మోదీజీ ఇరుక్క వేణ్డుం... మానిలతిల్ అమ్మ ఆట్చి వర వేణ్డుం. ఇదుక్కు చీణూ కూట్టణియై వెట్రి పెర చెయ్యుంగల్..(మీకు అభివృద్ధి కావాలా... ఉద్యోగ అవకాశాలు కావాలా? అలా అయితే కేంద్రంలో మోదీజీ ఉండాలి. రాష్ట్రంలో అమ్మ జయలలిత పాలన రావాలి. అందుకోసం ఎన్డీయే కూటమికి విజయం చేకూర్చండి.) అంటూ జయలలితను గుర్తు చేస్తూ తమిళ భాషలో ప్రసంగించారు. గతంలో వివిధ సందర్భాల్లో చంద్రబాబు తమిళనాడులో ప్రచారం చేసినా... ఈ స్థాయిలో తమిళంలో కామెంట్లు ఎప్పుడూ చేయలేదు. కానీ ఈసారి తమిళ భాషలో కొన్ని వ్యాఖ్యలు చేసి తమిళ ప్రజలను సీఎం చంద్రబాబు ఆకట్టుకున్నారు.

చైతన్యరథం

# చేతలు చూపిన సాయం!

- పుట్టినరోజు సందర్భంగా సీఎంఆర్ఎఫ్ ఫైలుపై సీఎం సిగ్నేచర్
- సహాయ నిధినుంచి రూ.56 కోట్ల విడుదలకు సంతకం
- 22 నెలల్లో అభాగ్యులకు రూ.1,298 కోట్ల ఆర్థిక సాయం



అమరావతి (చైతన్య రథం): ఏ మంచి సందర్భం వచ్చినా పేదలకు మేలు చేసే కార్యక్రమంతో ఆ రోజును ప్రారంభించడం ఆనవాయితీ చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఉగాది రోజు, న్యూఇయర్‌వంటి సందర్భాల్లో పేదలకు మేలు చేసే సీఎంఆర్ఎఫ్ ఫైలుపై తొలి సంతకం చేసి రోజువారీ విధులు ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ఇదే ఆనవాయితీని కొనసాగించారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో వేద ఆశీర్వచనం తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్‌కు వెళ్లారు. అక్కడ లబ్దిదారులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం రోడ్డుమార్గంలో గన్నవరం ఎయిర్ పోర్టుకు వెళుతున్న సమయంలో సీఎంఆర్ఎఫ్ ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న 7,074మందికి రూ.56.39 కోట్లు విడుదల చేసే దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం చేశారు. తన పుట్టిన రోజున పేదలతో కలిసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన సీఎం... తరువాత పేదలకు లబ్ధి చేకూర్చే ముఖ్యమంత్రి సహాయనిధి విడుదల ఫైలుపై సంతకం చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన నాటినుంచి ఈ 22 నెలల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం 1,43,314 మంది లబ్దిదారులకు రూ.1,298.33 కోట్లు అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇంత పెద్ద మొత్తంలో సీఎం సహాయ నిధి ద్వారా పేదలకు ఆర్థికసాయం అందించలేదు. ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక కష్టాలు అవరోధం కాకూడదనే ఆలోచనతో అనేక సవాళ్లున్నా... పెద్ద మనసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చంద్రబాబు ప్రజలకు సాయం చేస్తున్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్... డబుల్ డెవలప్‌మెంట్

- అన్నదమ్ముల్లా కలిసుండి.. ఏపీ, తమిళనాడును అభివృద్ధి చేద్దాం
- థలి బహిరంగ సభలో ఏపీ సీఎం చంద్రబాబు
- థలి నుంచి తిరుపతికి బస్ వేస్తామని సీఎం హామీ
- ఎన్డీఏ అభ్యర్థి నాగేష్‌కుమార్‌కు ఓటేయాలని కోరిన చంద్రబాబు



తమిళనాడు/ కృష్ణగిరి/ థలి (చైతన్య రథం): డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ డెవలప్‌మెంట్ జరుగుతుందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తమిళనాడు కృష్ణగిరి జిల్లా థలి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొని ఎన్డీయే అభ్యర్థి నాగేష్‌కుమార్‌కు మద్దతుగా ఓటేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్డీఏ నేతలు థలినుంచి తిరుపతికి బస్సు సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం అంగీకారించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, ఏపీ ప్రజలు చూపుతున్న ఆదరణ, అభిమానం తమిళనాడులోనూ కనిపించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తమిళనాడుకు వచ్చినా తన సొంత గడ్డపై ఉన్న భావన కలుగుతుందన్నారు. తమిళ సంస్కృతిపై ఎన్నో దాడులు జరిగినప్పటికీ ప్రాచీన వారసత్వాన్ని కాపాడుకున్న గొప్ప నేల తమిళనాడని కొనియాడారు. అనేక ప్రముఖులు, ఆధ్యాత్మిక క్షేత్రాలతో ప్రసిద్ధి చెందిన ఈ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉందని చెప్పారు. తిరుపతికి తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, భాష వేరైనా మనమంతా ద్రవిడులమనే భావనతో కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. నందమూరి తారక రామారావు సినీ జీవితం తమిళనాడులోనే ప్రారంభమైందని చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే చెన్నైకి తెలుగు గంగ నీళ్లు అందించిన ఘనత కూడా ఎన్టీఆర్‌దేనని తెలిపారు.

తాను తమిళనాడు-ఏపీ సరిహద్దులోని చిత్తూరునుంచి వచ్చినవాడినని, ఈ రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి పరస్పరం సహకరించుకుని అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**దేశానికి దిక్సూచిగా ప్రధాని మోదీ**

దేశానికి సమర్థ నాయకత్వం అందిస్తున్నది ప్రధాని నరేంద్ర మోదీయేనని కొనియాడిన చంద్రబాబు, సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనతో దేశ భవిష్యత్తును ప్రధాని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. భారత్‌ను ప్రపంచ పటంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టిన నాయకుడు మోదీ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును తీసుకువచ్చిందని, అయితే ఆ బిల్లును కాంగ్రెస్, డీఎంకే పార్టీలు వ్యతిరేకించాయని ఏపీ సీఎం విమర్శించారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇవ్వడంపై కాంగ్రెస్, డీఎంకేలకు వచ్చిన అభ్యంతరమేంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు సహకరించలేదని గుర్తుచేశారు. క్రెడిట్ అవసరం లేదని, ప్రతిపక్షాలకే క్రెడిట్ ఇస్తామని ప్రధాని చెప్పిన తర్వాత కూడా బిల్లును అడ్డుకున్నారని చంద్రబాబు గుర్తు చేశారు. నియోజకవర్గాల సంఖ్య 50శాతం పెరుగుతుందని స్పష్టంగా చెప్పినప్పటికీ.. ఎందుకు వ్యతిరేకించారో డీఎంకే సమాధానం చెప్పాలని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

**ఎన్డీఏ గెలుపు... అభివృద్ధికి మలుపు**

తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ అవసరమని, ఎన్డీఏ ప్రభుత్వం గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఏపీ సీఎం అన్నారు. ఏపీలో గత పాలకులు విధ్వంసం సృష్టిస్తే... తాము కేవలం 22 నెలల్లోనే రాష్ట్రాన్ని విధ్వంసంనుంచి వికాసంవైపు నడిపిస్తున్నామని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్‌వల్లే ఇది సాధ్యమైందన్నారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తీసుకువెళ్లేలా నదుల అనుసంధానం చేపడతామని, గంగా-కావేరి కలయిక లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీనికి కేంద్రంలో మోదీ నాయకత్వం కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగనివ్వనని, ఈ ప్రాంత అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. తమిళనాడు కొన్ని అంశాల్లో వెనుకబడిందని, దీనికి కారణం ఎవరో ప్రజలకు తెలుసని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎంకే పాలనలో తిరోగమనం**

బసవ జయంతివంటి పవిత్రమైన రోజున ఈ ప్రాంతానికి రావడం తన అదృష్టమని సీఎం చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో అప్పుల భారం పెరిగిందని, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, డ్రగ్స్ సమస్య, మహిళలపై దాడులు, కస్టోడియల్ మరణాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం ధరలుపెంచి డీఎంకే ప్రభుత్వం ఆదాయం పెంచుకుంటోందని విమర్శించారు. అభివృద్ధి, ఉద్యోగాల కోసం కేంద్ర సహకారం కీలకమని, మాజీ సీఎం జయలలిత స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి జరగాలని సూచించారు. ఎన్డీయేకు వేసే ప్రతి ఓటు తమిళనాడు అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తి గెలిచే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. బహిరంగ సభలో స్థానిక ఎన్డీయే పక్ష నేతలు పాల్గొన్నారు.

తెలుగు తమిళ సోదరులు

# పాలు నీళ్లలా కలిసుందాం


- రోడ్ షోలో ఏపీ సీఎం చంద్రబాబు పిలుపు
- మహిళలకు డిఎంకే, కాంగ్రెస్ ద్రోహం చేశాయని వ్యాఖ్య
- రెండు పార్టీలను నిలదీయాలన్న చంద్రబాబు
- ఎన్డీయేను గెలిపిస్తే పక్షంరోజుల్లో మార్పు సాధ్యమన్న సీఎం



అన్నానగర్ (చైతన్య రథం): 'ఒకప్పుడు ఒక్క రాష్ట్రంగా కలిసున్న ప్రజలం మనం. ఇప్పుడు రాష్ట్రాలు వేరైనా.. ఆంధ్ర తమిళ ప్రజలు పాలూ నీళ్లలా కలిసుండి అభివృద్ధి సాధిద్దామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్నానగర్‌లో రోడ్ షో నిర్వహించిన అనంతరం.. అశేష జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ.. "అత్యంత సుసంపన్నమైన ఘన చరిత్ర ద్రవిడ సంస్కృతిది. తెలుగులో ఎన్టీఆర్–తమిళంలో ఎంజీఆర్ చెన్నైకి తాగునీటి కోసం తెలుగు గంగ ప్రాజెక్టు తెచ్చారు. తిరువళ్లువర్ నుంచి అబ్దుల్ కలామ్ వరకూ ఎందరో మహానుభావులు, ప్రాచీన దేవాలయాలు, పర్యాటక కేంద్రాలు తమిళనాడు సొంతం. ఆంధ్రప్రదేశ్ అంతా అరుణాచలానికి వస్తోంది. తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించేందుకు తమిళులు వస్తారు. ఒకప్పుడు ఒక్క రాష్ట్రంగా కలిసి ఉన్న ప్రజలం మనమంతా. ద్రవిడ యూనివర్సిటీ ద్వారా అందరినీ కలపాలని ఎన్టీఆర్ ప్రయత్నించారు. చెన్నైకి నీరు ఇచ్చేందుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాం" అన్నారు. "మోదీ నేతృత్వంలో భారత దేశానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం తెలిసిన వ్యక్తి ప్రధాని మోదీ. మహిళా రిజర్వేషన్ల బిల్లుపెడితే పార్లమెంటులో దానిని ఈ రెండు (డిఎంకె, కాంగ్రెస్) పార్టీలు ఓడించాయి. మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకేలు అడ్డుకున్నాయి. ఓట్లకోసం వచ్చే ఈ రెండు పార్టీల అభ్యర్థులను ఈ విషయం మీద గట్టిగా నిలదీయాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అదనంగా 50 సీట్లు వస్తాయి. ఏ రాష్ట్రానికీ నష్టం లేదు. ఇప్పుడున్న సీట్ల ప్రకారమే 50శాతం అదనంగా సీట్లు వచ్చే పరిస్థితి ఉండేది. మహిళలకు వచ్చే ప్రాతినిధ్యాన్ని రానీయకుండా కాంగ్రెస్, డీఎంకేలు అడ్డుపడ్డాయి. జనాభా దామాషా ప్రకారం సీట్లు వస్తే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగుతుంది. ప్రధాని మోదీ ఓ సంస్కరణవాది. రాజకీయ లబ్ది కోసం డీఎంకే తప్పుడు ప్రచారం చేస్తోంది. చెన్నై నగరంలో అభివృద్ధి ఆగిపోయింది. చెన్నై విమానాశ్రయ అభివృద్ధి అక్కడే ఆగిపోయింది. తమిళనాడులో మౌలి కసదుపాయాల కల్పన ఆగిపోయింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు. మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెరిగాయి. తమిళనాడు అభివృద్ధి కావాలంటే ఎన్డీయే గెలవాలి. డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి. 2019–24 మధ్య వైసీపీ కారణంగా ఏపీ ధ్వంసమైంది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ పునర్నిర్మాణం చేస్తున్నాం. నదుల అనుసంధానం అయితే నీటి భద్రత వస్తుంది. గంగా కావేరీ అనుసంధానం కావాలి. గోదావరి–కృష్ణా నదులను ఏపీలో అనుసంధానించాం. త్వరలో కావేరీ వరకూ నీరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు రావాలి. ఎన్డీయేతో అది సాధ్యం. హిందూ సంస్కృతిని ద్వేషిస్తున్నారు. భారతీయ సంస్కృతిని గౌరవించడం లేదు. డీఎంకే పోవాలి. తమిళనాడు గెలవాలి. కేంద్ర సహకారంతో తమిళనాడు అభివృద్ధి చెందాలి. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు ఎంజీఆర్ పేరు పెట్టింది ఎన్డీయేనే. చరిత్ర ఉన్నంత వరకూ ఎన్టీఆర్, ఎంజీఆర్‌ను ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. తమిళ ప్రజల భవిష్యత్ మార్చేది ఎన్డీయే కూటమి మాత్రమే. ఎన్డీయే అభ్యర్థులకు ఓటు వేస్తే తమిళ ప్రజలంతా గెలిచినట్టే. నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తమిళనాడు ప్రజలందరికీ ధన్యవాదాలు" అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఎన్డీయేకు చంద్రబాబు ఊపు

## ఉత్సాహంగా ఏపీ సీఎం తమిళనాడు ఎన్నికల ప్రచారం






- తొలిరోజు ప్రచారానికి అద్భుతమైన స్పందన
- కదలివచ్చిన తమిళ, తెలుగు ప్రజలు, స్థానికులు
- ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు
- కోయంబత్తూరులో ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో భేటీ
- తెలుగు ప్రజల ప్రాంతమైన థలి ఎన్నికల సభకు హాజరు
- తమిళనాడులోని అధికార పార్టీ తీరుపై నిప్పులు
- ప్రభుత్వ వైఫల్యాలను తమిళంలోనే ఎత్తిచూపిన చంద్రబాబు
- మార్పు రావాలంటే ఎన్డీయే రావాలని తమిళ సోదరులకు పిలుపు
- ఏపీ డబుల్ ఇంజన్ సర్కార్ ప్రయోజనాలను వివరిస్తూ ప్రసంగాలు
- మహిళా బిల్లు, డీ లిమిటేషన్ విషయంలో డీఎంకే, కాంగ్రెస్ చారిత్రక తప్పిదం చేశాయని విమర్శ
- మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న డిఎంకేను ఓడించాలని మహిళలకు విన్నపం.
- థలి సభకు పెద్దఎత్తున తరలి వచ్చిన తెలుగు ప్రజలు.
- సీఎంకు బర్త్ డే విషెస్ చెపుతూ ఉత్సాహంగా ప్లకార్డుల ప్రదర్శన.
- సమయాభావం కారణంగా అవడి సభ రద్దు చేసుకుని అన్నానగర్ వెళ్లిన చంద్రబాబు.
- తెలుగు, తమిళం, ఇంగ్లీషుల్లో మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్న వైనం.
- ఎన్డీయే వస్తే 15 రోజుల్లోనే మార్పొస్తుందని హామీనిచ్చిన చంద్రబాబు.
- చెన్నైతో ఉన్న అనుబంధాన్ని, తెలుగుగంగ తెచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్న చంద్రబాబు
- జనసందోహం మధ్య అన్నానగర్‌లో కొనసాగిన సీఎం చంద్రబాబు రోడ్ షో.
- ఏఐఏడీఎంకే, బీజేపీ సహా వివిధ ఎన్డీయే పక్షాల కార్యకర్తలు, నేతలతో కిక్కిరిసిన అన్నానగర్ రోడ్లు
- రోడ్ షోలో ఓటర్లకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం చంద్రబాబు ర్యాలీ.
- చంద్రబాబు రోడ్ షోలో పాల్గొన్న అన్నానగర్, టీ-నగర్, విల్లివాక్కం ఎన్డీఏ అభ్యర్థులు
- అన్నానగర్ రోడ్ షో అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరిన సీఎం చంద్రబాబు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినోత్సవం సందర్భంగా 'చిగురు' స్వచ్ఛంద సంస్థలో అనాథ బాలలకు అన్నదానం చేస్తున్న నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురుజాల మాల్యాద్రి, చైతన్యరథం యూట్యూబ్ ఛానెల్ నిర్వహకులు పాలడుగు వినీలా, బండారు వంశీ.


# ఆప్తమిత్రుడికి జన్మదిన శుభాకాంక్షలు

- ఎక్స్‌లో పోస్టు పెట్టిన ప్రధాని మోదీ
- చంద్రబాబుకు పలువురు శుభాకాంక్షలు



ఢిల్లీ (చైతన్య రథం): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "కష్టపడి పనిచేసే ఏపీ సీఎం, ఆప్తమిత్రుడు చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆయన నాయకత్వంలో ఏపీ అన్ని రంగాల్లోనూ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ఆయనకు దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం లభించాలని ఆకాంక్షిస్తున్నా' అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. అలాగే, సీఎం చంద్రబాబుకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బృహత్తర బాధ్యత తీసుకున్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. పెట్టుబడులకు చిరునామాతో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తున్నారు. ఏపీ అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తోంది. చంద్రబాబుకు సంపూర్ణ ఆయురారోగ్యాలను అందించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని పవన్ పేర్కొన్నారు. సినీ నటుడు చిరంజీవి శుభాకాంక్షలు తెలుపుతూ.. "మీ దూరదృష్టి, పట్టుదల, ప్రజలపట్ల ఉన్న అంకిత భావం ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. రాష్ట్ర అభివృద్ధి కోసం మీ నిర్విరామ కృషి అందరికీ మార్గదర్శకం. ఆ భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి, ప్రజల కోసం మీరు కనే ప్రతి స్వప్నం సాకారం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. సీనియర్ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విషెస్ చెప్తూ.. "చంద్రబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. దూరదృష్టి, అభివృద్ధిపట్ల అంకితభావం.. ఇవే మీ నాయకత్వానికి ప్రతీక. రాష్ట్రాభివృద్ధికి మీ నిరంతర కృషి.. ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తోంది. ఏపీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న మీ విజన్ దేశానికే ఆదర్శం. మీ నాయకత్వంలో ఏపీ.. మరింత పురోగతి సాధించాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు.

చైతన్యరథం






# ఉరకలెత్తిన ఉత్సాహం

తమిళనాట ఎన్డీయే కూటమి గెలుపును కాంక్షిస్తూ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన తొలిరోజు ఎన్నికల ప్రచారం ఉత్సాహంతో ఉరకలెత్తింది. తొలిరోజు ప్రచారానికి అద్భుతమైన స్పందన రావడమే కాదు, ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు తమిళ, తెలుగు ప్రజలు ఉత్సాహంగా జేజేలు పలికారు. ప్రచారంలో ప్రథమ ఘట్టంగా కోయంబత్తూరులో ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైన చంద్రబాబు -అక్కడినుంచి థలిలోని ఎన్నికల సభకు హాజరయ్యారు. తమిళనాడులోని అధికార డిఎంకే వైఫల్యాలపై నిప్పులు చెరిగిన చంద్రబాబు, తమిళనాట తిరిగి అభివృద్ధి కనిపించాలంటే ఎన్డీయేను గెలిపించాలని తమిళ సోదరులకు పిలుపునిచ్చారు. ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్‌తో సాధించిన ప్రయోజనాలను వివరిస్తూనే.. మహిళా బిల్లు, డీలిమిటేషన్ విషయంలో డీఎంకే, కాంగ్రెస్‌లు మహిళలకు ఏవిధంగా అన్యాయం చేశాయో వివరించారు. ఎన్నికల ప్రచార సభలో ప్రత్యర్థుల వైఫల్యాలను తూర్పారబడుతూనే.. సందర్భానుసారం తమిళ భాషలో మాట్లాడుతూ -ప్రసంగాల్లో ఆద్యంతం ఆసక్తిరేకెత్తించారు. చెన్నైతో ఉన్న అనుబంధాన్ని, తెలుగుగంగను తెచ్చిన సందర్భాలను గుర్తు చేసుకుంటూనే -తమిళ తెలుగు ప్రజలు సోదరభావంతో మెలుగుతూ రెండు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేద్దామని అప్పీల్ చేశారు. ఇదే రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం కావడంతో -శుభాకాంక్షలు చెప్పేందుకు అటు తెలుగు, ఇటు తమిళ ప్రజలు ఉత్సాహం కనబర్చారు. భారీ జనసందోహం మధ్య అన్నానగర్‌లోకి అడుగు పెట్టిన ఏపీ సీఎం చంద్రబాబు.. ఏఐఏడీఎంకే, బీజేపీ సహా వివిధ ఎన్డీయే పక్షాల నేతలు, కార్యకర్తలతో పెద్దఎత్తున నిర్వహించిన రోడ్ షో -హైలెట్‌గా నిలిచింది. ఎన్డీయే కూటమిని గెలిపించుకుంటే -డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ డెవలప్‌మెంట్ ఉంటుందన్న సీఎం చంద్రబాబు అప్పీల్.. స్థానిక ఓటర్లపై పాశుపతాస్త్రంగా పనిచేసింది. అందుకు -చంద్రబాబు రోడ్ షోతో కిక్కిరిసిన అన్నానగర్ నిలువెత్తు నిదర్శనం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిరోజు ఎన్నికల ప్రచారం సూపర్ సక్సెస్ అయ్యింది.



















చైతన్యరథం

## అభిమాన నేతకు

# అభినందనల వెల్లువ



### సీఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు- రాజకీయ, సినీ, క్రీడా రంగ ప్రముఖుల ట్వీట్లు

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా సినీ, రాజకీయ, క్రీడా రంగ ప్రముకులు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, అస్సాం ముఖ్యమంత్రులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగానూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అభిమానులు, కార్యకర్తలు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రోగులు, వృద్ధులకు పండ్లు పంచిపెట్టి కేక్‌లు కట్ చేసి అభిమానాన్ని చాటుకున్నారు.

**యోగి ఆదిత్యనాథ్ శుభాకాంక్షలు**

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**అస్సాం సీఎం హిమంత్‌బిశ్వ శర్మ శుభాకాంక్షలు**

అస్సాం సీఎం హిమంత్‌బిశ్వ శర్మ ఎక్స్ వేదికగా చంద్రబాబకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం లోని అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు పట్టుదలతో పనిచేస్తున్నారు. ఎన్డీయే యొక్క విలువైన భాగస్వామిగా, వికసిత్ భారత్ యొక్క దృక్పథాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మా కామాఖ్య, శ్రీమంత శంకర్దేవ్ ఆశీస్సులతో ఆరోగ్యకరంగా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**తెలంగాణ సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**జన్మదిన శుభాకాంక్షలు: వైఎస్.జగన్**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఆరోగ్యంగా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**విజన్‌తో ముందుకునడిపిస్తున్నారు: పవన్**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘపాలన అనుభవం, విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బృహత్తర బాధ్యతను తీసుకున్నారు. మీ పాలనలో అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తుంది. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలను ఆకాంక్షించారు.

**తమిళనాడు నేత పళనిస్వామి శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏఐఏడీఎంకే తమిళనాడు నేత పళనిస్వామి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరిన్ని కాలాల పాటు ఉండాలని ఆకాంక్షించారు.

**శుభాకాంక్షలు మావయ్య: నారా బ్రాహ్మణి**

ప్రజాసేవ పట్ల మీకున్న మక్కువ, రాష్ట్రంపై మీకున్న నిబద్ధతను చూసి మా హృదయాలు గర్వంతో నిండిపోతున్నాయి. మా కుటుంబానికి నిరంతరం ప్రోత్సాహం, మార్గదర్శకంగా ఉన్నందుకు ధన్యవాదాలు. మీ అపురూపమైన నాయకత్వ ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు.

**మీరే మాకు స్ఫూర్తి: నందమూరి తేజశ్విని**

విజనరీ నేత చంద్రబాబుకు బాలయ్య కుమార్తె నందమూరి తేజశ్విని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మీరు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

**దగ్గుబాటి పురందేశ్వరి శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**ఆయురారోగ్యాలు ఇవ్వాలి: వై.ఎస్.షర్మిల**


ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకుంటూ మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు.

**క్రీడాకారులకు మీరే స్ఫూర్తి: పీవీ సింధు**

నాలాంటి క్రీడాకారులకు మీ ప్రోత్సాహానికి ధన్యవాదాలు. మీరు మాకు ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తారు. ప్రజాసేవలో మీ సేవలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నాను.

**పీటీ ఉష శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్రీడాకారిణి పీటీ ఉష ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




హృదయపూర్వక శుభాకాంక్షలు. ఎల్లప్పుడూ మంచి ఆరోగ్యం, ఆనందాన్ని అనుగ్రహించాలని, ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

**సోనూసూద్ శుభాకాంక్షలు**

మీ దూరదృష్టి, అభివృద్ధి, నిబద్ధత లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. భవిష్యత్తు తరాలకు మీ ప్రోత్సాహం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాల పాటు ప్రజా సేవలో ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు.

**ఎప్పటికీ స్ఫూర్తి: సినీనటుడు చిరంజీవి**

మీ దూరదృష్టి, పట్టుదల, ప్రజలపై ఉన్న అంకితభావం ఎప్పటికీ స్ఫూర్తిదాయకం. రాష్ట్ర అభివృద్ధి కోసం మీ నిర్విరామర్విరామ కృషి అందరికీ మార్గదర్శకం. ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి ప్రజల కోసం మీరు కనే ప్రతి స్వప్నం సాకారం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు.

**మావయ్యకు శుభాకాంక్షలు: జూనియర్ ఎన్టీఆర్**

మెనీ హ్యాపీ రిటర్న్ ఆఫ్ ది డే మావయ్య. ఆరోగ్యం, ఆనందం, అంకితభావం, దృక్పథంతో ప్రజలకు సేవ చేసే శక్తిని కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీ నాయకత్వం రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు, గర్వాన్ని ప్రేరేపిస్తుంది.

**దూరదృష్టి అభినందనీయం: మహేష్‌బాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. మీ దృఢత్వం, దూరదృష్టి ఎల్లప్పుడూ అభినందనీయం. అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నా.

**మీ సేవలు కొనసాగాలి: రామ్‌చరణ్**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సినీనటుడు రామ్ చరణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, మరెన్నో కాలాల పాటు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

**కంప్యూటర్ విద్యకు ఆద్యుడు: సి.హెచ్.విజయ్**

ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను 1996 లోనే ప్రవేశపెట్టిన దార్శనికుడు, కంప్యూటర్ విద్యలో 1,50,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించిన సీఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు.

సుపరిపాలనకు చిరునామా: వంగలపూడి అనిత

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ సారథి, అభివృద్ధి ప్రదాత, సుపరిపాలనకు చిరునామా ముఖ్యమంత్రి చంద్ర బాబుకు జన్మదిన శుభా కాంక్షలు. రాష్ట్రం పట్ల మీకు న్న దూరదృష్టి, ప్రజల సంక్షేమం కోసం మీరు పడే తపన మాకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి.

**అభివృద్ధికి బెంచ్‌మార్క్: పీయూష్‌గోయల్**

మీ దూరదృష్టితో కూడిన దృక్పథం, సంస్కరణల ఆధారిత నాయకత్వం ఆంధ్రప్రదేశ్ వృద్ధికి శక్తినిస్తున్నాయి, భారతదేశ ఆర్థిక పురోగతికి కీలక ఇంజిన్‌గా దాని స్థానాన్ని బలోపేతం చేస్తున్నాయి. మీరు బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తూనే ఉన్నారు. భారత్ సేవలో మీరు సుదీర్ఘమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు.

**సుజనాచౌదరి శుభాకాంక్షలు**

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత, నా రాజకీయ గురువు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ అనుభవం, దార్శనికత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దిశానిర్దేశం చేయాలని, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**విజన్ ప్రతిరూపం: బీఆర్ నాయుడు**

కంప్యూటర్ నుంచి క్వాంటమ్ వ్యాలీ వరకు, హైటెక్ సిటీ నుంచి వరల్డ్ క్లాస్ క్యాపిటల్ అమరావతి వరకు మట్టిని మణిగా మార్చే మహా నాయకుడు, విజన్ ప్రతిరూపంగా నిలిచే దార్శనికుడు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**70 ఏళ్ల ప్రస్థానం: ఎమ్మెల్యే ఏలూరి**

76 ఏళ్ల ప్రస్థానం.. అనుక్షణం ప్రజాహితం కోసం శ్రమిస్తున్నారు. మీరు ఎందరికో స్ఫూర్తి. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులు, నవ్యాంధ్ర రూపశిల్పికి జన్మదిన శుభాకాంక్షలు.

**విజనరీ నేత: దూళిపాళ్ల నరేంద్ర**

తెలుగు ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే శ్రామికుడు, తెలుగు ప్రజల కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన దార్శని కుడు, తెలుగు రాష్ట్రాల అభ్యున్నతికి కృషి చేసిన నిత్య కృషీవలుడు, 76 ఏళ్ళ నవ యువకుడు, విజనరీ నేత చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు.

**జీవీ.రెడ్డి శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవీ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**అనన్య నాగళ్ల, స్వాతిరెడ్డి శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి మాన్యశ్రీ చంద్రబాబుకు పసుపు కుటుంబసభ్యుల తరపున టీడీపీ మహిళా కార్యకర్త లు అనన్య నాగళ్ల, స్వాతిరెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**స్వర్ణాంధ్ర సాధకుడు: బండ్ల గణేష్**

ఆనాడు సాంకేతిక పరిజ్ఞానంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దిన దార్శనికుడు. రాజధాని అమరావతిని నిర్మిస్తూ నవ్యాంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తున్న అపర భగీరథుడు. కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తినిస్తున్న నిండు చంద్రుడు చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు.

**శతమానంభవతి: పరుచూరి గోపాలకృష్ణ**

ముఖ్యమంత్రి చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు. పరిపాలనా దక్షత అంటే ఏమిటో అనేకసార్లు నిరూపించిన రాజకీయ యోధునికి శతమానం భవతి. మీ సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకు పోవాలని ఆకాంక్షిస్తున్నాను.

**మీ నాయకత్వం అవసరం: బండి సంజయ్**

మీ నాయకత్వం, అనుభవం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరం. ఎనలేని మీ కృషి ప్రజాజీవితంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. మీకు మంచి ఆరోగ్యం, సంతోషం, ఇంకా ఎన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలు.

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుభాకాంక్షలు**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఆరోగ్యంతో పాటు దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో జీవించాలని ఆకాంక్షించారు. మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**ధర్మపురి అరవింద్ ప్రశంసలు**

సీఎం చంద్రబాబుకు ధర్మపురి అరవింద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 1990లలోనే స్పష్టమైన విజన్‌తో రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లను ప్రణాళికాబద్ధంగా విస్తరించి యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తూ తెలుగు, తెలంగాణ యువతను ప్రపంచ ఐటీ రంగానికి తీసుకెళ్లారని ప్రశంసించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతూ హైటెక్ సిటీ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి లక్షలాది ఉద్యోగావకాశాలకు మార్గం సుగమం చేశారని చంద్రబాబు సేవలను గుర్తుచేశారు.

**మీ నుంచే పతకం అందుకున్నా: పూనమ్ కౌర్**

నటి పూనమ్ కౌర్ సీఎం చంద్రబాబుతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. 7వ తరగతిలో మీ నుంచి తొలి బంగారు పతకం అందుకున్నాను. నా కాలేజీ ప్రవేశం నిఫ్ట్ మీ వల్ల జరిగింది. నా కాలేజీకి నిధులు సమకూర్చిన నా సోద రీమణులు హైటెక్ సిటీలో ఉద్యోగం చేశారని గుర్తు చేసుకున్నారు.

**మీ అంకితభావం మాకు స్ఫూర్తి: సంపూర్ణేష్‌బాబు**

మీ అచంచలమైన అంకితభావం, దూరదృష్టి గల నాయకత్వం, అవిశ్రాంతమైన సేవ రాష్ట్ర వ్యాప్తంగా అసంఖ్యాక జీవితాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ప్రజా సేవలో మరెన్నో విజయవంతమైన సంవత్సరాలు ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు.

**దార్శనిక నేతకు శుభాకాంక్షలు: నాగబాబు**

గొప్ప దార్శనికుడు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మార్గదర్శకుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. మీ నాయకత్వం, విజన్‌తో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటున్నాను.

**సంగీత దర్శకుడు తమన్ శుభాకాంక్షలు**

విజనరీ నేత, సీఎం చంద్రబాబుకు సంగీత దర్శకుడు తమన్ శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో కాలాలపాటు ఆయురారోగ్యాలతో ముందుకుసాగాలని ఆకాంక్షించారు.

**సినీనటుడు శివాజీ శుభాకాంక్షలు**

భావితరాల భవిష్యత్‌కు నిరంతర శ్రామికుడు పోలవరం, అమరావతికి ప్రాణం పోసిన నిత్యకృషీవలుడు, బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం లిఖిస్తున్న చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకి తీసుకునివెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను.

**మార్గదర్శకులు మీరు: జర్నలిస్టు మూర్తి**

కాలం తో పాటు కొందరు నడుస్తారు..ఆ కాలాన్నే మలిచేవారు చాలా అరుదుగా ఉంటారు. మీ ప్రయాణం సమయాన్ని గడిపిన కథ కాదు. సమయాన్ని నడిపిన చరిత్ర..భవిష్యత్తును నిర్మిస్తున్న వర్తమానం. ఎప్పటి లానే మీ ఆలోచనలు కాలాన్ని దాటిపోవాలని.. మీ ప్రయాణం తరాలకు మార్గదర్శకం కావాలని జన్మదిన శుభాకాంక్షలు.

చైతన్యరథం

# దార్శనికుడు సీఎం చంద్రబాబు

- అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా రంజక పాలన
- రామచంద్రపురం నియోజవర్గంలో సేవా కార్యక్రమాలు
- రక్తదాన శిబిరం, అన్నదానం, చలివేంద్రాలు
- మృత్యుంజయ హోమం నిర్వహించిన మంత్రి సుభాష్

రామచంద్రాపురం(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామ చం ద్రాపురం నియోజకవర్గంలో పలు సామాజిక సేవా కార్యక్రమా లు, రక్తదానం, చలివేంద్రాలు, అన్నదానం, మృత్యుంజయ హోమాలు పెద్దఎత్తున నిర్వహించారు. తొలుత స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించి అనంతరం మీడియాతో మాట్లాడారు. విజన్ ఉన్న నాయకుడిగా తన ఆలోచనల సంకల్పాన్ని సజీవంగా మార్చే మహాశక్తి చంద్రబాబు అని అభివర్ణించారు. అనంతరం సీఎం జన్మదిన సందర్భంగా కేకు కోసి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వాలంటరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్ వైద్యుల పర్యవేక్షణలో జరిగిన రక్తదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి



ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, గరికపాటి సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్లు, కూటమి పార్టీ నాయకులు, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి,వయిట్ల గజలక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి, బల్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

- నియోజకవర్గవ్యాప్తంగా పండుగ వాతావరణం
- అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.3 లక్షలు

రాయచోటి(చైతన్యరథం): మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటిలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్న క్యాంటీన్ దగ్గర భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాయచోటి అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఉమా మహేశ్వరరాజు, వెంకటసుబ్బారెడ్డి రూ.3 లక్షల చెక్కు అందజే శారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లలో ఉచిత భోజన సదు పాయాన్ని కల్పించిన భువనేశ్వరమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. ముఖ్యమంత్రి 76వ జన్మదిన వేడుకలను రాయచోటిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులుతో కలిసి పండుగ వాతావరణంలో జరుపుకోవడం చాలా సంతోషంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటిలోని అన్న క్యాంటీన్ వద్ద మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం



చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. రాష్ట్రానికి దార్శనికుడు, అభివృద్ధి ప్రదాత అయిన చంద్రబాబు సేవలు రాష్ట్రానికి సుదీర్ఘకాలం అవసరమన్నారు. భువనమ్మ రూ.76 లక్షలు అన్న క్యాంటీ న్లకు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆయనకు ప్రజలందరి ఆశీర్వాదం ఉండాలని కోరారు.

# పాలనాదక్షుడు సీఎం చంద్రబాబు

- తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు
- ఆర్థిక సంస్కరణలు అభివృద్ధికి చిహ్నాలు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి
- కొండపిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

కొండపి (చైతన్యరథం): కొండపి నియోజకవర్గంలో ముఖ్యమం త్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింగరాయకొండ కొండ, పొన్నలూరు, కొండపిలలో జరిగిన సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి హాజర య్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సింగరాయకొండ అన్న క్యాంటీన్ లో మంత్రి పేదలకు భోజనం వడ్డించిన అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని భువనేశ్వరి రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం అందజేసి ఒకరోజు పేదల ఆకలి తీర్చారు. అభివృద్ధి,



సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న పాలనాదక్షుడు చంద్రబాబు. తెలుగు వారి ఆత్మగౌరవం చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అయితే తెలుగువారి ఆత్మవిశ్వాసాన్ని విశ్వవ్యాప్తం చేసింది చంద్రబాబు. ఆయన నాయకత్వ పటిమ, పోరాట స్ఫూర్తి, పాలనదక్షత, ఆర్థిక సంస్కరణలు రాష్ట్ర అభివృద్ధి చిహ్నాలు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు, పీ4 విధానం దీర్ఘదృష్టి నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

# ఏపీకి రూ.1805 కోట్ల ఉపాధి నిధులు

అమరావతి(చైతన్యరథం): ఉపాధి హామీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.1805.24 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎక్స్‌లో వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేం దుకు ఈ నిధులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధిని బలోపేతం చేసి పేదలు, అర్హులైన కుటుంబాల కు ఆర్థిక భరోసాను అందిస్తాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించడం, జీవనోపాధి స్థిరత్వాన్ని పెంచ డమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో గ్రామీణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిధుల విడుదలకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.



# రాంబిల్లిలో మెగా సోలార్ ప్లాంట్

- శంకుస్థాపనకు ఏర్పాట్ల పరిశీలన
- అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష



అనకాపల్లి (చైతన్యరథం): యలమంచిలి నియోజకవర్గం రాంబి ల్లిలో రెన్యూ ఏర్పాటు చేస్తున్న ఆరు మెగా వాట్ల సోలార్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, కార్పొరేషన్ ఛైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించాను. రాష్ట్రాన్ని అభివృద్ధి, ఉద్యోగాల కేంద్రంగా మార్చే లక్ష్యంతో పెట్టుబడులు ఆకర్షిస్తు న్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని తెలిపారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలంటేనే భయపడే పరిస్థితి నుంచి నేడు పెట్టుబడిదారులు ఏపీలో పెట్టుబడికి ముందుకు రావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకం. ఉత్తరాంధ్రలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుం టూ అభివృద్ధి బాటలో అడుగులు వేస్తున్నామని చెప్పారు. రాంబిల్లిలో సుమారు 6 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు ఈ ప్రాంతానికి గర్వకారణం. 15 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేశాం. ఇప్పుడు ఈ ప్లాంటు ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు వేలాది ఉద్యోగాలు కల్పించ బోతున్నామని తెలిపారు.

# ఏపీ ప్రభుత్వ ఉద్యోగాలపై కొత్త ఉత్తర్వులు

- స్థానికతను నిర్ణయిస్తూ గ్రీన్‌సిగ్నల్
- జిల్లా, జోనల్, మల్టీజోనల్స్‌గా విభజన

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక కేడర్ల పున ర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జీఓ నం.45 ద్వారా ఇప్పటికే అమలులో ఉన్న నిర్ణయానికి అధికారికం గా ఆమోదం లభించింది. లోకల్ క్యాడర్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన కొత్త ఉత్తర్వులను విడుదల చేసింది. రాష్ట్ర పునర్వ్య వస్థీకరణ అనంతరం ఏర్పడిన 26 జిల్లాల ప్రకారం ఉద్యోగాల కేటాయింపును సవరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం పాత జిల్లాల వ్యవస్థను ఆధారంగా తీసుకుని ఉద్యోగాలను జిల్లా, జోనల్, మల్టీజోనల్ క్యాడర్లుగా విభజించారు. మొత్తం రాష్ట్రాన్ని 6 జోన్లు, 2 మల్టీజోన్లుగా విభజిస్తూ జిల్లాలను వర్గీకరించారు. స్థానిక అభ్యర్థులకు 95 శాతం వరకు రిజర్వేషన్ అమలు చేయనున్నారు. స్థానికత నిర్ణయానికి 4 సంవత్సరాల చదువు లేదా నివాసాన్ని ప్రమాణంగా తీసుకుంటారు. చదువు లేని వారికి 4 సంవత్సరాల నివాసాన్ని ఆధారంగా పరిగణిస్తారు. అవసరమైతే 7 సంవత్సరాల నివాసాన్ని కూడా స్థానికతకు ప్రమాణంగా గుర్తించే అవకాశం ఇవ్వనున్నారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో జిల్లా యూనిట్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కేటాయిం పులో సీనియారిటీకి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే ఈ మార్పులపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేయాలనుకుంటే 60 రోజుల గడువు విధించారు. అయితే కొన్ని విభాగాలకు స్థానిక రిజర్వేషన్ నుంచి మినహాయింపు ఇచ్చారు. సచివాలయం, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, రాష్ట్రస్థాయి సంస్థలు వంటి వాటికి ఈ రిజర్వే షన్ వర్తించదు. అలాగే రాజధాని ప్రాంతంలోని పోలీస్ పోస్టులకు కూడా స్థానిక రిజర్వేషన్ అమలు చేయరని అధికారులు స్పష్టం చేశారు.

**ఆరు జోన్ల వివరాలు**

**జోన్–1:** శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి

**జోన్–2:** అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ

**జోన్–3:** పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా

**జోన్–4:** గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు

**జోన్–5:** తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప

**జోన్–6:** నంద్యాల, అనంతపురం, కర్నూలు, సత్యసాయి

చైతన్యరథం

# నైపుణ్య వికాసం రాష్ట్ర ప్రగతికి కీలకం

- నూతన జనాభా నిర్వహణలో సమగ్ర కార్యాచరణ
- 95 శాతం ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ
- అవకాశాలను వినియోగించుకోవాలి
- వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో సంతానోత్పత్తి పెంపు నకు ఆటంకంగా ఉన్న ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించే దిశగా అన్ని వర్గాల ప్రజల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత నైపుణ్య వికాస ప్రణాళికను రూపొందిం చిందని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జనాభా స్థిరీకరణ లక్ష్యంగా రూపొందించిన నూతన విధానంలో ఈ నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను పొందుపరిచారని సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. నేటి శతాబ్దపు ఆర్థిక అవసరాలకు అనుగుణంగా అన్ని వయసుల వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నూతన జనాభా నిర్వహణ విధానంలో భాగంగా ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు ప్రజల ఆర్థిక సుస్థిరత కోసం అందరికీ నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతను గుర్తించి ఆ మేరకు కార్యక్రమాల్ని చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఆర్థిక, సామాజిక రంగాలకు అవసరమైన సేవల డిమాండ్ గుర్తింపు, లభ్యతల మధ్య వ్యత్యాసాలను గుర్తించి కొరతను తీర్చే దిశగా శిక్షణా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ వికాసంలో అందరూ పాల్గొనే విధంగా దోహదపడేందుకు నూతన జనాభా నిర్వహణ కోసం రూపొందించిన 5 స్థంభాల్లో (5 పిల్లర్స్) భాగంగా నైపుణ్యం అంశాన్ని పొందుపరిచినట్లు వివరించారు.

**'నైపుణ్యం' లక్ష్యాలు**

ఈ దిశగా...2035 నాటికి 95 శాతం ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతను కల్పించడం, 75 శాతం ప్రజలకు గుర్తించిన మేరకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, శిక్షణ పొందిన వారిలో 80 శాతానికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం, శిశు సంరక్షణ మరియు వృద్ధులకు అవసరమైన సేవలందించేందుకు లక్ష మందికి సర్టిఫికెట్ కోర్సుల్ని అందించడం, శ్రామిక శక్తి భాగస్వామ్యంలో మహిళల వాటాను 25 శాతం పెంచడం వంటి లక్ష్యాల్ని నిర్ధారించినట్లు మంత్రి తెలిపారు. మూడంచెలలో నైపుణ్యాభివృద్ధి కలిగించేలా కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఉన్నత స్థాయి నైపుణ్యావసరాలను తీర్చేందుకు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

## నవ్యాంధ్ర రూపశిల్పికి జన్మదిన శుభాకాంక్షలు

**- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

అమరావతి (చైతన్యరథం): కోట్లాది ఆంధ్రుల జన హృదయ నేత ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'పరిణితి చెందిన రాజ నీతిజ్ఞుడు, దూరదృష్టి కలిగిన నాయకుడిగా చంద్ర బాబు పాలనలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఆయన నిబద్ధత రాజకీయ నేతలకు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. 'స్వర్ణాం ధ్ర-2047' విజన్‌తో నిర్విరామంగా శ్రమిస్తున్న ఆయన ఆయురా రోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## మంత్రి ఆనం ఆధ్వర్యంలో ఆయుష్ష హోమం

**- ఆత్మకూరులో చంద్రబాబు జన్మదిన వేడుకలు**



ఆత్మకూరు (చైతన్యరథం): మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు సంపూర్ణ ఆయుష్షుతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ సంపూర్ణ ఆయుష్ష హోమం చేపట్టారు. వేద మంత్రాలు, హోమ పూజ కార్యక్రమాలతో పూదిర ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి సీఎం చంద్రబా బుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు నియోజక వర్గ ప్రజలు, ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తల పాల్గొన్నారు. అతిథులచే రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపి ణీ చేశారు. దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, వీవోఏలకు మొబైల్ ఫోన్స్ అందజేశారు.

## అన్న క్యాంటీన్‌లో చంద్రన్న జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర**



అనకాపల్లి(చైతన్యరథం): యలమంచిలి నియోజకవర్గంలోని అన్న క్యాంటీన్‌లలో చంద్రబాబ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్, ఇంచార్జి ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర కేక్ కట్ చేశారు. అనంతరం క్యాంటీన్‌కు విచ్చేసిన ప్రజలకు భోజనం వడ్డించారు. పేదల కోసం ఆలోచించి అన్ని అన్న క్యాంటీన్లో ఉచిత భోజనం అందించడం భువనమ్మ దాతృత్వానికి నిదర్శనమన్నారు. గతంలో రూ.2కి కిలో బియ్యంతో ఎన్టీఆర్ సంక్షేమానికి శ్రీకారం చుట్టారు. అదే స్ఫూర్తితో గతంలో చంద్రబాబు అన్న క్యాంటీన్ వ్యవస్థను ఏర్పాటు చేశార ని తెలిపారు. పేదల కడుపు నింపడాన్ని కూడా ఓర్చు కోలేక జగన్‌రెడ్డి అన్న క్యాంటీన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు.

## విజయనగరంలో చంద్రన్న జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సంధ్యారాణి
- కార్యక్రమంలో వీవోఏలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ



విజయనగరం(చైతన్యరథం): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు విజయనగరం జిల్లాలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వ హించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో 108 మంది వీవోఏలకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి 5+ స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేశారు. మహిళలు, మండల అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాం క్షలు తెలిపారు. ఎస్‌హెచ్‌జీ, స్త్రీనిధి, సీఐఎఫ్‌లకు రూ.2.86 కోట్ల చెక్ అందజేశారు. సాలూరు మండలం, పాచిపెంట మండలాలకు 2 స్వచ్ఛ రథాలు ప్రారంభించారు. పాచిపెంట మండలంలో 5 సచివాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు.

**"డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు బ్రో" 2.0 అవగాహన కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారా ణి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల కోసం చలివేంద్రం ప్రారంభించారు. సాలూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యా లయం నుంచి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదు.. బెట్టింగులకు దూరం గా ఉండాలి. మంచి అలవాట్లుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో రక్తదాన శిబిరం



పాలకొల్లు(చైతన్యరథం): పట్టణంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో అన్నదానం, రక్తదాన శిబిరాలు, వృద్ధులకు, వికలాంగు లకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజనీతిలో కోవిదుడు, పాలనలో దక్షుడు, ప్రజల హృదయాలలో చిరస్థాయి గా నిలిచిపోయారని ప్రశంసించారు. డిజిటల్ పాలన స్వప్నాన్ని వాస్తవంగా మార్చిన ఆధునిక భారత నిర్మాత, ఐటీ రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చిన సాంకేతిక మార్గదర్శి, తెలుగు జాతిని ప్రపంచపటంపై నిలిపిన గ్లోబల్ విజనరీ చంద్రబాబు. నీటి పారుదల ప్రాజెక్టులతో రైతుల కన్నీరు తుడుస్తున్న జలసాధకుడు చంద్రబాబు. ఆంధ్రుల ఆత్మవిశ్వాసానికి ప్రతీక, తెలుగు జాతి గర్వకారణం, నవ్యాంధ్ర ను నిర్మిస్తున్న విశ్వకర్మ చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు.

## చిత్తూరులో సీఎం జన్మదిన వేడుకలు



చిత్తూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దూర దృష్టి, ప్రజల సంక్షేమం కోసం ఆయన పడే తపన అభినందనీ యమని, ఆయన ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో టీడీపీ నాయకులు రాజశేఖర్ నాయుడు, సోమశేఖర్ నాయుడు, వాసు నాయుడు, గందమనేని నరేష్, బీజేపీ చిన్నగొట్టిగల్లు మండలా ధ్యక్షులు దండు కిషోర్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ మత్తుం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లెలో సేవా కార్యక్రమాలు

**- చంద్రబాబు జన్మదిన వేడుకల్లో నేతలు**

**- కేక్ కట్ చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



బనగానపల్లె (చైతన్యరథం): మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం బనగాన పల్లెలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. భగవంతుడు ఆయన కు ఆయురారోగ్యాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే శక్తినివ్వాలని ఆకాంక్షిస్తూ చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్న నేత చంద్రబాబు అని ప్రశంసించారు. భవిష్యత్తులో టెక్నాలజీ ఏ విధంగా ఉంటుందో ముందే ఊహించగల విజనరీ లీడర్ అని కొనియాడారు. ఈ వేడుకల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత భూ దౌర్జన్యంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- వైసీపీ నాయకుల కనుసన్నల్లో రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం.. జేసీబీలతో ఇంటి పునాదుల ధ్వంసం
- 40 ఏళ్ల నాటి భూమిపై కబ్జాదారుల కన్ను... దొంగ పట్టాలతో దౌర్జన్యం
- అర్జీలు స్వీకరించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట మండలం ఎదురుదొన గ్రామానికి చెందిన రమణప్ప వినతి... నాకున్న ఒక్క ఎకరం భూమిని నా తమ్ముడు చిన్న రమణప్ప మధ్యవర్తిత్వంతో వైసీపీ నాయకుడైన మాచర్ల గుంసలప్ప వద్ద రూ.లక్షకు 2 రూపాయల వడ్డీ చొప్పున మూడు సంవత్సరాల గడువుతో తనఖా రిజిస్ట్రేషన్ చేశాను. రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించాము. అయితే అప్పుల భారం పెరిగిపోవడంతో నా పెద్ద కుమారుడు శివశంకర్ తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న నాకు మానవత్వంతో సాయం చేయాల్సింది పోయి గడువు ముగిసిందనే నెపంతో గుంసలప్ప నాకు భూమిని తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదని బెదిరిస్తున్నాడు. గ్రామ పెద్దల ద్వారా పంచాయితీ పెట్టినా ఆ నాయకుడు ససేమిరా అనడమే కాకుండా, భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఉన్న ఒక్క ఎకరం భూమి పోతే నా కుటుంబం వీధిన పడాల్సిందే. వారిపై చర్యలు తీసుకోని నా సమస్యను పరిష్కరించండి.

వైఎస్సార్ కడప జిల్లా అట్లూరు మండలం కోనరాచపల్లి గ్రామానికి చెందిన అయ్యవారయ్య అర్జీ... నా తండ్రి పునగాని గంగయ్య పేరు మీద 1998లోనే సర్వే నెం. 1022, ప్లాట్ నెం.11లో 2 సెంట్ల స్థలానికి ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ స్థలం నా ఆధీనంలోనే ఉంది. టీడీపీ సభ్యుడనే నెపంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. 2-2-2024న ఎటువంటి నోటీసులు లేకుండా జేసీబీతో నా ఇంటి పునాదులను అక్రమంగా తొలగించారు. ఈ అన్యా యంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పునిచ్చింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కంటిచూపు లేని వ్యక్తి అని కూడా చూడకుండా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వృద్ధురాలు, నలుగురు చిన్న పిల్లలు ఉన్న కుటుంబాన్ని రోడ్డున పడేశారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం కొండామారేపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ వినతి... సర్వే నెం.235/3లో నాకు 2.05 ఎకరాల భూమి ఉంది. ఇది గత 40 ఏళ్లుగా మా కుటుంబ ఆధీనంలో ఉంది. దీనికి సంబంధించి 40 ఏళ్ల క్రితం నాటి ఆర్‌డీఆర్, అడంగల్, బుక్-4 పట్టా, ఇతర రెవెన్యూ రికార్డులన్నీ మా పేరిటే ఉన్నాయి. మదనపల్లి మండల సర్వేయర్ సుబ్రమణ్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తున్నారు. రికార్డులు మార్చేందుకు ప్రయత్నిస్తూ సబ్ డివిజన్ పేరుతో మమ్మల్ని మానసికంగా ఇబ్బందిపెడుతున్నారు. సర్వేయర్ అండతో ప్రైవేట్ వ్యక్తులు, గూండాలు మా భూమిపైకి వచ్చి మాపై దౌర్జన్యానికి దిగుతున్నారు. దొంగ పట్టాలు సృష్టించి మా భూమిని లాక్కోవాలని చూస్తున్నారు.

కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురం గ్రామానికి చెందిన మాణిక్యాలరావు వినతి... నాకు ఆ గ్రామంలోని సర్వే నెం.156/1, 179/1, 179/2(, 179/2ూ లో మొత్తం 5.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 8 ఏళ్లుగా పామాయిల్ తోట సాగు చేస్తున్నాను. మా కుటుంబ వాటాల పరిష్కారం కోసం భూమి విలువ తెలుసుకోవడానికి కానుమోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. నా వ్యవసాయ భూమి రికార్డుల్లో 'ఎకరాల్లో కాకుండా 'చదరపు గజాల్లో ఉన్నట్టు చూపిస్తోందని అధికారులు చెప్పారు. మేము వ్యవసాయం చేసుకుంటున్నామని మొరపెట్టుకున్నా వారు స్పందించలేదు. దీనిపై ఫిర్యాదు చేయగా స్పందించిన సబ్ రిజిస్ట్రార్, తహసీల్దారు స్వయంగా మా పొలానికి వచ్చి పరిశీలించారు. అక్కడ పామాయిల్ తోట ఉన్నట్టు ధ్రువీకరిస్తూ... అది వ్యవసాయ భూమేనని రిపోర్ట్ ఇచ్చారు. రిపోర్టులు పంపి ఐదు నెలలు గడుస్తున్నా, ఇంతవరకు రికార్డుల్లో మార్పు జరగలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేయట్లేదు.

అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం కొండయ్య గారిపల్లి గ్రామానికి చెందిన కె.శ్రీనాథ్ అర్జీ... నాకు పిత్రార్జితంగా వచ్చిన భూమికి సంబంధించి ఇప్పటివరకు పట్టా పాసుపుస్తకాలు మంజూరు కాలేదు. దీని కోసం మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోతోంది. గతంలో గ్రామ సర్వేయర్లు సర్వే నెం. 1656-5 లో ఉన్న నా 0.19 సెంట్ల భూమిని పొరపాటున లేదా అక్రమంగా వేరే వారి పేరు మీద రికార్డులో మార్చారు. ఈ భూమి నాకు రిజిస్టర్డ్ వీలునామా ద్వారా సంక్రమించింది. దీనికి సంబంధించిన రిజిస్టర్డ్ అగ్రిమెంటు, అన్ని ఆధారాలు నా దగ్గర ఉన్నాయి. ఈ భూమిని నా పేరిట మార్చడానికి అవసరమైన ప్రభుత్వ రుసుము కూడా ఇదివరకే చెల్లించాను.

వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం లక్ష్మీ బాలాజీనగర్ గ్రామానికి చెందిన వీరయ్య వినతి... జంగంరాజు పల్లి గ్రామ పరిధిలో సర్వే నెం.1240/7,1240/10లో రెండు ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించిన అన్ని పత్రాలు నా వద్ద ఉన్నాయి. కానీ ఈ సర్వే నెంబర్లు దాదిబోయిన సురేష్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం చేసే ఈయన తన తల్లి, భార్య పేరున అప్పటి తహసీల్దార్, వీఆర్వోతో కుమ్మక్కు అయ్యి ఎలాంటి ఆధారాలు లేకుండా ఆక్రమంగా ఆన్‌లైన్ చేశారు. దీనిపై వారిని ప్రశ్నించగా నీకు దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు.

అనంతపురం జిల్లా కుందుర్పికి చెందిన కురుబ రాజన్న విజ్ఞప్తి... ఎనుమలదొడ్డి గ్రామ పరిధిలోని సర్వే నెం. 93-10లో నాకు 4.50 ఎకరాల పొలం ఉంది. ఇందులో 3 బోర్లు, 2 మోటార్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ భూమిలో కాపునకు వచ్చిన 300 మామిడి చెట్లు ఉన్నాయి. గత 7 ఏళ్లుగా నా భార్య కె. లలితమ్మ, కుమారులు కె.శ్రావణ్‌కుమార్, కె.అజయ్, కుమార్తెలు సోనియా, చిట్టి, కోడళ్లు అందరూ కలిసి నా భూమిని దౌర్జన్యంగా కబ్జా చేశారు. తన భూమిలో పండిన పంటను తనకు దక్కకుండా చేసి, నన్ను ఇంటి నుంచి వెళ్లగొట్టి, కనీసం పూట గడవని స్థితిలోకి నెట్టారు. 75 ఏళ్ల వయస్సులో తన సొంత భూమిపై హక్కు లేకుండా చేశారు.

ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం నాగులూరుతండాకు చెందిన వనజ అర్జీ... మా గ్రామంలోని సర్వే నెం. 571-4లో గల 1.67 ఎకరాల భూమిని ప్రభుత్వం నాకు 2005లో మంజూరు చేశారు. నా దగ్గర పట్టా పాసుపుస్తకాలు, సర్వే రికార్డులు అన్నీ ఉన్నాయి. అందులోనే మామిడి తోట సాగు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన బోరు సదుపాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. గత రెండేళ్లుగా ఆ భూమిని అడంగల్, 1-బి రికార్డుల్లో ఆన్‌లైన్ చేయమని రెడ్డిగూడెం తహసీల్దారు చుట్టూ తిరుగుతున్నాను. కానీ ఆయన పట్టించుకోకుండా "నీకు భూమి లేదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని గ్రామానికి చెందిన బాబావతు రమేష్, చిన్న వెంకటేష్, లక్ష్మి, సరస్వతి, వారి అనుచరులు గోపి, చందావతు నాగులు, ధూక్యా బాల అనే వ్యక్తులు నా భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. వారు నా పొలంలోని మామిడి కాయలను అక్రమంగా కోసుకుపోవడమే కాకుండా, మొక్కలకు నీరు పెట్టనివ్వకుండా మోటారు వైర్లు కట్ చేస్తున్నారు. మినుము పంటపై గడ్డి మందు కొట్టి మొత్తం నాశనం చేశారు. ఇటీవల తహసీల్దారు నోటీసు ఇవ్వగా నా భూమి వద్దకు వెళ్లాను. వారందరూ గుంపుగా చేరి నన్ను అసభ్య పదజాలంతో దూషించారు. కిందపడేసి కాళ్లతో, చేతులతో విచక్షణారహితంగా కొట్టి జుట్టు పట్టుకుని బయటకు గెంటేశారు. "మళ్ళీ భూమి వద్దకు వస్తే చంపేస్తాం" అని ప్రాణహాని తలపెట్టేలా బెదిరిస్తున్నారు.

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన పద్మావతి విజ్ఞప్తి... మా గ్రామంలో సర్వే నెం.500, దాఖలా 2-163 డోరు నెంబరు గల 211 గజాల స్థలానికి ప్రభుత్వం తన పేరుతో సంపూర్ణ హక్కులతో కూడిన పట్టా మంజూరు చేసింది. గతంలో కుమారుడు మరణించిన తర్వాత కోడలు ముతికేపల్లి శ్రీదేవి తనను ఇంటి నుండి అక్రమంగా గెంటేసిందని, బినామీ పత్రాలు సృష్టించి కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు తన పేరుతో పొందుతోంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా

# సీఎం "బర్త్ డే" వేడుకలు

- అభిమానుల సమక్షంలో "మన చంద్రన్న-2 పుస్తకం" విడుదల
- గుమ్మడి గోపాలకృష్ణ ఆలపించిన "తెలుగునేల పుణ్యఫలం" పాట విడుదల
- గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 76 వసంతాలకు గుర్తుగా 76 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న అభిమానులు

మంగళగిరి (చైతన్యరథం) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న దార్శనికుడు చంద్రబాబు నాయుడు క్షేమంగా, ఆరోగ్యంగా నూరేళ్లు వర్ధిల్లాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి. వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్దన్, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు సహా పలువురు కీలక నేతలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరపుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... "చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ స్వర్ణాంధ్రగా మారుతుందని, ఆయన అనుభవం రాష్ట్ర భవిష్యత్తుకు శ్రీరామరక్ష" అని కొనియాడారు. కార్యకర్తల కేరింతలు, నినాదాలతో పార్టీ కార్యాలయం పండుగ వాతావరణాన్ని తలపించింది. అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయాలు, ప్రజా సంక్షేమంపై టీడీపీ జాతీయ ఉపాధ్య క్షుడు, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యుడు టీడీ జనార్దన్ రచించిన 'మన చంద్రన్న-2' పుస్తకాన్ని అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. తొలి కాపీని సీఎం చంద్రబాబుకి జనార్దన్ అందజేశారు.అనంతరం ఏపీ నాటకరంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ స్వయంగా రచించి పాడిన "తెలుగునేల పుణ్యఫలం చంద్రబాబునాయుడు" వీడియో పాటను విడుదల చేశారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు 76 వసంతాలకు గుర్తుగా 76కిలోల భారీ కేక్ కట్ చేశారు. సీఎం జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి



గోపాలకృష్ణ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు చైర్మన్ కృష్ణయ్య, ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, శ్రీశైలం ఆలయ కమిటీ మెంబరు ఏవీ రమణ, టీడీపీ కార్యనిర్వా హక కార్యదర్శి పాతర్ల రమేష్, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబరు రావిపాటి సత్యనారాయణ, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వందనదేవి, మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు వేమూరి ఆనందసూర్య, బోద్దులూరి వెంకటేశ్వరరావు, చప్పిడి రాజశేఖర్, చెన్నుపాటి గాంధీ, పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరలు పాల్గొన్నారు.

చైతన్యరథం

# విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు

- ఆయన సంకల్పంతోనే ఛార్జీల తగ్గింపునకు చర్యలు
- గోదావరి పుష్కరాల విద్యుత్ పనులకు రూ.150 కోట్లు
- రెండు నెలల ముందే పనుల పూర్తికి ప్రణాళిక
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- తూర్పుగోదావరిలో రూ.485 కోట్లతో
- విద్యుత్ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



రాజమండ్రి (చైతన్యరథం): త్వరలో జరగబోయే అఖండ గోదావరి మహా పుష్కరాలకు సర్వం సిద్ధం చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. సహచర మంత్రి కుందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణమూర్తి, మద్దిపాటి వెంకట రాజుతో కలిసి సోమవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించా రు. తూర్పుగోదావరి జిల్లాలో రూ.485 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలలో పాల్గొన్నారు. ముందు గా పుష్కరాల నేపథ్యంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.96.90 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో విద్యుత్ సంస్కరణలు మొదటిగా అమలు చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబేనని గుర్తు చేశారు. గోదావరి పుష్కరాల కోసమే రూ.150 కోట్లతో భక్తులకు ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయి విద్యుత్ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పుష్కరాల ప్రారంభానికి రెండు నెలల ముందే విద్యుత్ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా విద్యుత్ ఛార్జీల తగ్గింపు, నాణ్యమైన విద్యుత్ నిరంతరాయ సరఫరానే అంతిమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాజమండ్రి రివర్ వ్యూ ఎస్ఎస్ నుంచి కోటి లింగాల ఘాట్ వరకు భూగర్భ కేబుల్ వ్యవస్థ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. రాజమండ్రి గౌతమి పుష్కర ఘాట్ లో సోమవారం 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ను, కడియంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ను ప్రారంభించామన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేస్తుందన్నారు.

### 20 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఉత్పతి

వడిశలేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ వినియోగదా రులకు ఏర్పాటు చేసుకున్న పీఎం సూర్యఘర్‌ను మంత్రి ప్రారం భించారు. అనంతరం రూ.కోటి పైగా నిధులతో వడిశలేరులో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే నల్లిమిల్లి కలిసి ప్రారంభించారు. పుష్కర పనుల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ త్వరలోనే రాజమండ్రిలో పర్యటిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం బొమ్మూరులో కొత్తగా ఏర్పాటు చేసిన ఏపీ ట్రాన్స్‌కో నిలయాన్ని ప్రారంభించారు. వేపకాయల పాలెం దిబ్బలో టాన్స్ కో 220/33 కేవీ సబ్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. సాయంత్రం ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ సమీపంలోని వెలుగుబండలో 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ప్రారం భించారు. తదనంతరం దివాన్ చెరువు వద్ద డివిజన్, సబ్ డివిజన్, రెవెన్యూ కార్యాలయాల నిర్మాణాలకు మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ పురందరేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సింగపూర్‌లో చంద్రబాబు జన్మదిన వేడుకలు

- పాల్గొన్న పురపాలక మంత్రి నారాయణ
- ఘన స్వాగతం పలికిన తెలుగుదేశం ఫోరం



అమరావతి(చైతన్యరథం): పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారిక పర్యటన నిమిత్తం సోమ వారం సింగపూర్ చేరుకున్నారు. సింగపూర్ విమానాశ్రయంలో ఆయనకు సింగపూర్ తెలుగుదేశం ఫోరం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సింగపూర్ తెలుగుదేశం ఫోరమ్ ఆధ్వర్యం లో నిర్వహించిన సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఫోరమ్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు రాష్ట్రాభివృద్ధిపై చూపుతున్న ఆసక్తి, అనుబంధం ప్రశంసనీయ మన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఏకతాటిపై నిలిచి రాష్ట్ర పురోగతికి తోడ్పడటం ఆనందదాయకమని తెలిపారు. రేపటి నుంచి సింగపూర్ ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్ర మాల్లో మంత్రి నారాయణ పాల్గొననున్నారు.

## తాడేపల్లి స్క్రిప్ట్ ప్రకారమే

# కడపలో వైసీపీ నేత హత్య

- హత్యా రాజకీయాలకు వైసీపీ కేరాఫ్ అడ్రస్
- వివేకా హత్య నుంచి పెద్ద దస్తగిరి హత్య వరకు అంతా ఒకే ప్లాన్
- రాజకీయ ప్రయోజనాల కోసం సొంత పార్టీ శ్రేణులనే బలి చేస్తున్న జగన్ రెడ్డి
- నిత్యానంద రెడ్డికి అడ్డుగా ఉన్నాడనే నెపంతోనే పెద్ద దస్తగిరి దారుణ హత్య
- అధికారం కోసం తల్లి, చెల్లి, బాబాయ్‌లను సైతం కాదనుకునే నైజం జగన్ ది
- 2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తగ్గని 'నరుకుతాం.. చంపేస్తాం' అనే హెచ్చరికలు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో అధికారం కోసం, ఆస్తుల కోసం, డబ్బు కోసం ఎంతకైనా తెగించే ఒక 'విష సంస్కృతిని' వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం సొంత బాబాయినే గొడ్డలిపోటుతో హతమార్చిన చరిత్ర ఆ పార్టీదని, అదే బాటలో నేడు కార్యకర్తల ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సొంత బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి చంపి, ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టి రాజకీయంగా లబ్ధి పొందిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. ఆ రోజు మొదలైన 'గొడ్డలి పోటు' రాజకీయం నేడు క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు పాకింది. కడపలో పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించిన కార్యకర్త దస్తగిరిని సైతం నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకున్నారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ డిప్యూటీ మేయర్ అయిన నిత్యానంద రెడ్డి తన రూ.100 కోట్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలకు అడ్డుగా ఉన్నాడనే ఏకైక కారణంతో దస్తగిరిని అంతమొందించడం దారుణం. వివేకా హత్య జరిగినప్పుడు రక్తపు మడుగులో ఉన్న బాబాయి మృతదేహాన్ని గుండెపోటుగా చిత్రీకరించి, సాక్ష్యాలను ఏ రకంగా అయితే తుడిచిపెట్టారో.. నేడు దస్తగిరి హత్య విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. హత్య చేసిన నిందితులు నేరుగా వెళ్లి నిత్యానంద రెడ్డిని కలవడం చూస్తుంటే, ఈ హత్యల వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో స్పష్టమవుతోంది. రాష్ట్రంలో హత్య రాజకీయాలకు, గొడ్డలి సంస్కృతికి వైసీపీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు రక్షణ లేకపోగా, అడ్డు వస్తే సొంత మనుషులనే చంపేసే స్థాయికి ఆ పార్టీ నేతలు దిగజారిపోయారు' అని వ్యాఖ్యానించారు.

### తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతోనే...

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిది రాజకీయ ఆలోచన కాదు... పక్కా 'క్రిమినల్ మైండ్' అని రాష్ట్ర మంత్రి తీవ్రంగా విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సాగుతున్న హత్యాయత్నాలు, దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో జగన్ పరామర్శ యాత్రలో జరిగిన ఘటనను గుర్తు చేసి మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. "సాధారణంగా రోడ్డుపై ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదానికి గురైతేనే మనం కారు ఆపి మానవత్వంతో ఆసుపత్రికి పంపిస్తాం. కానీ జగన్మోహన్ రెడ్డి తన కాన్వాయ్ చక్రాల కింద సొంత కార్యకర్త నలిగి చనిపోతుంటే, కారు కింద నిమ్మకాయ నలిగినట్లుగా భావించి.. ఆ శవాన్ని పక్కన పొదల్లోకి విసిరేసి వెళ్లారంటే ఆయనలో మానవత్వం ఉందా?" అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డికి అధికారం, డబ్బు తప్ప మరేమీ కనిపించవు. తన ప్రయోజనం కోసం బాబాయ్ అయినా, చెల్లి అయినా, తల్లి అయినా, చివరికి ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసే కార్యకర్త అయినా ఆయన దృష్టిలో కేవలం ఒక వస్తువు మాత్రమే. అడ్డు వస్తే ఎవరినైనా తొలగించుకుంటూ పోయే 'గొడ్డలి సంస్కృతి'ని రాష్ట్రం చూస్తోందని విమర్శించారు.

'నాడు వివేకానంద రెడ్డిని గొడ్డలితో చంపి ఆ సాక్ష్యాలను తుడిచిపెట్టి గుండెపోటుగా చిత్రీకరించారు. ఆ 'నారాసుర రక్త చరిత్ర'ను చంద్రబాబు మీదకు నెట్టడానికి జగన్ ఎంతగా ప్రయత్నించారో ప్రజలందరూ చూశారు. జగన్ దృష్టిలో తన సొంత చిన్నాన్న అయినా, తల్లి అయినా, చెల్లి అయినా కేవలం రాజకీయ పావులే తప్ప మరేమీ కాదు. 2018లో 'కోడికత్తి' డ్రామాతో సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన జగన్, ఆ కేసులో నిందితుడిగా ఉన్న ఒక పేద దళిత బిడ్డ జీవితాన్ని ఎలా బలిపెట్టారో మనం చూశాం. తన గెలుపు కోసం ఒక సామాన్యుడి జీవితాన్ని నాశనం చేయడమే జగన్ మార్క్ రాజకీయం. వైసీపీ కార్యకర్తలు గమనించాలి.. మిమ్మల్ని జగన్మోహన్ రెడ్డి తన అధికార దాహం తీర్చుకోవడానికి కేవలం 'టూల్స్' (పనిముట్లు) లాగా మాత్రమే వాడుకుంటారు. అవసరం తీరాక పెద్ద దస్తగిరి లాగా మిమ్మల్ని గాలికి వదిలేస్తారు, ఆస్తుల కోసం మీ ప్రాణాలనే బలి తీసుకుంటారు.' అన్నారు.

### చిచ్చు పెట్టాలని చూస్తున్నారు...

2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి ఓడించినా జగన్‌లో మార్పు రాలేదు. తనను ఓడించారనే కక్షతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందకూడదని, ప్రజలు సుఖంగా ఉండకూడదని ఆయన కోరుకుంటున్నారు. "చంపేస్తాం, నరికేస్తాం, అంతు చూస్తాం" అనే మాటలు తప్ప ఆయన నోటి నుంచి ఒక నిర్మాణాత్మకమైన మాట రావట్లేదు. ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మళ్ళీ చిచ్చు పెట్టాలని, అభివృద్ధికి అడ్డుపడాలని జగన్ ప్రయత్నిస్తున్నారు. ప్రజలు తనను గద్దె దించారన్న కోపంతో, రాష్ట్రాన్ని కష్టాల్లోకి నెట్టాలని కుట్రలు పన్నుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, తన రూ. 100 కోట్ల సెటిల్మెంట్లకు అడ్డు వస్తున్నాడనే ఉద్దేశంతో కార్యకర్త దస్తగిరిని చంపించారంటే.. ఆ పార్టీలో ప్రాణాల కంటే పైసలకే ఎక్కువ విలువ ఉందని అర్థమవుతోంది. తాడేపల్లితో ఉన్న ఆర్థిక అనుబంధం వల్లే ఇటువంటి కబ్జాలు, సెటిల్మెంట్లు యథేచ్ఛగా సాగుతున్నాయని' మంత్రి విమర్శించారు. సాధారణంగా ఏదైనా రాజకీయ పార్టీ ఓడిపోతే.. "మేము తప్పులు సరిదిద్దుకుంటాం, మళ్లీ అధికారంలోకి వస్తే మంచి పాలన అందిస్తాం" అని ప్రజలకు చెపుతుంది. కానీ జగన్ రెడ్డి పార్టీ మాత్రం "నరుకుతాం, తొక్కేస్తాం, అంతు చూస్తాం" అంటూ వీధిరౌడీల్లా మాట్లాడుతోంది. ఇటువంటి హింసాత్మక భావజాలం ఉన్న పార్టీకి ప్రజాస్వామ్యంలో ఉండే అర్హతే లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి తన క్రిమినల్ మైండ్‌తో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవడం, ఉన్న పనులను పడగొట్టడం, ప్రజలను బెదిరించడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ 'గొడ్డలి పార్టీ'గా, 'రప్ప రప్ప' పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రశాంతత వర్ధిల్లాలంటే ఇటువంటి హింసను ప్రోత్సహించే నాయకత్వానికి రాష్ట్రంలో చోటుండకూడదని మంత్రి పిలుపునిచ్చారు. డబ్బు కోసం, అధికారం కోసం సొంత మనుషులనే మింగేసే ఇటువంటి విష సంస్కృతిని అంతమొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. "జగన్ రెడ్డీ... మీ నేతలు చేసే ప్రతి కబ్జా, ప్రతి సెటిల్మెంట్ వాటా తాడేపల్లికి చేరుతున్న మాట వాస్తవం కాదా? మీ ధనదాహానికి అడ్డు తగిలితే సొంత కార్యకర్తలనైనా నిర్దాక్షణంగా చంపేస్తారా? ఈ 'రౌడీ రాజకీయం' ఇకపై సాగదు. మీ గొడ్డలి సంస్కృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు శాశ్వతంగా సమాధి కట్టడం ఖాయమని రామానాయుడు హెచ్చరించారు.

# వైభవంగా సింహాద్రి అప్పన్న చందనోత్సవం

**అప్పన్న నిజరూప దర్శనానికి పోటెత్తిన భక్తులు - పట్టువస్త్రాలు సమర్పించిన హోంమంత్రి అనిత**





విశాఖపట్నం (చైతన్యరథం): సింహాచల క్షేత్రంలో కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి చందనోత్సవం కనులపండువగా సాగుతోంది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే సాక్షాత్కరించే అప్పన్న నిజరూపాన్ని చూసేందుకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 2.30 గంటల సమయానికే దాదాపు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.1500, రూ.1000, రూ.300 ప్రత్యేక దర్శనాలతో పాటు ధర్మ దర్శనం లైన్లలో భక్తులు క్రమశిక్షణతో దర్శనాలు చేసుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానంలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తున్నారు. ఎండ వేడిని తట్టుకునేందుకు క్యూలైన్లలోనే భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు, పాలు పంపిణీ చేస్తున్నారు. పోలీసు బందోబస్తు మధ్య చందనోత్సవ వేడుకలు ప్రశాంతంగా సాగుతున్నాయి.

**పట్టువస్త్రాలు సమర్పించిన హోంమంత్రి అనిత**

సింహాచలం అప్పన్న స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున హోంమంత్రి అనిత పట్టు వస్త్రాలు సమర్పించారు. సింహాచలం అప్పన్న స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. సింహాచల అప్పన్న స్వామి అనుగ్రహం, సీఎం చంద్రబాబు ఆశీస్సులతో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దార్శనికుడు సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. సింహాద్రి అప్పన్న దర్శనం చక్కగా చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# ఆరు వేల మంది విద్యార్థినులతో కోలాటం

**- అరుదైన రికార్డు కోసం సన్నద్ధం**

**- మన్యం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు**




పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా మరో అరుదైన రికార్డు సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈనెల 22న జిల్లా కేంద్రంలో సుమారు ఆరు వేల మంది విద్యార్థినులతో కోలాటం నృత్య ప్రదర్శనకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కేంద్రం పార్వతీ పురంలో ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నిరంతరాయంగా 18 నిమిషాల పాటు కోలాటం నృత్య ప్రదర్శన చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోనే జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు తేవాలన్న ఆకాంక్షతో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో జిల్లాకు ప్రత్యేక స్థానం కల్పించడం కోసం తనవంతుగా కృషి చేస్తున్నారు. జిల్లా విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కలెక్టర్ ప్రారంభించిన పాఠశాల ముస్తాబు కార్యక్రమం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది. కాగా ఇదే స్ఫూర్తితో గ్రామ ముస్తాబుతో పాటు ప్రతి ఇంటి ముస్తాబు కార్యక్రమాలను సైతం జిల్లాలో అమలు చేస్తున్నారు. కొండ శిఖర గిరిజన గ్రామా ల్లో ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం మెరుగు, ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంతో చేపడుతున్న 'ముస్తాబు'కు విశేష స్పందన లభిస్తోంది.

# అబద్ధాలు చెప్పడం... అడ్డంగా దొరకడం

- **హంద్రీనీవా ప్రాజెక్టుపై రాయలసీమ ద్రోహి జగన్ కుట్రలు**
- **రాయలసీమ రైతులకు సాగునీరు లేకుండా చేయడమే జగన్ మాస్టర్ ప్లాన్**
- **2019-24 మధ్య ప్రాజెక్టులు కొట్టుకుపోయినా పట్టించుకోని సీమ ద్రోహి**
- **ఐదేళ్ల పాలనలో 102 సాగునీటి ప్రాజెక్టుల పనులు రద్దు చేసిన జగన్**
- **రూ.3,873 కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వంపై నిందారోపణలు**
- **హంద్రీనీవా ద్వారా 52 టీఎంసీ నీటి తరలింపు చరిత్రలో రికార్డు**




రాయలసీమలో కరువు కాటకాలకు పాతరేసి సాగు, తాగునీరు అందించినా, హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసినా, డ్రిప్ ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఉద్యానవన హబ్‌గా రాయలసీమను మార్చినా అది ఒక్క చంద్రబాబుకే సాధ్యమైంది. అనేకమంది ముఖ్యమంత్రులు రాయలసీమనుంచి వచ్చినా... పుట్టిన గడ్డ రుణం తీర్చుకున్నది మాత్రం చంద్రన్న ఒక్కరే. 2014-19మధ్య రూ.12,441 కోట్లు ఖర్చు చేసి... 22 నెలల్లో మరో రూ.8 వేల కోట్లు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం, ప్రాజెక్టుల మరమ్మతుల కోసం ఖర్చు చేశారు. 2026-27 బడ్జెట్‌లో మరో రూ.10 వేల కోట్లు కేవలం రాయలసీమ ప్రాజెక్టులకే కేటాయించి పెద్ద మనసు చాటుకున్నారు. రూ.40 వేల కోట్లతో హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమను మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,873 కోట్లు ఖర్చు చేసి 100 రోజుల్లోనే 738 కి.మీ. దూరంలోని కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను అందించాడు. 250 రోజుల్లో రికార్డ్ టైంలో 52 టీఎంసీ నీటిని రాయలసీమకు తరలించి కొత్త చరిత్ర లిఖించాడు. ప్రస్తుతం ఫేజ్ 2 పనులకు రూ.1,184.50 కోట్లు కేటాయించి శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**రాయలసీమ ద్రోహిగా మిగిలిన జగన్**

దేవతల కాలంలో ఏమంచి పనులు చేసినా రాక్షసులు అడ్డుపడినట్టు... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏ మంచిచేసినా ఆ కార్యక్రమంపై విషం చిమ్మడం, తప్పుడు కథనాలను, అబద్ధాలను వండి వార్చటం వైసీపీకి, అవినీతి పుత్రిక సాక్షికి పరిపాటి. అబద్ధపు రాతలు, కట్టు కథలకు పుట్టిన విషపుత్రిక సాక్షి పత్రిక అనేది మరోసారి రుజువైంది. కృష్ణానదిలో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు వైఎస్సార్ లేఖ రాసి రాయలసీమ రైతుల గొంతు కోస్తే... అప్పర్ భద్ర నిర్మిస్తున్నా జగన్ పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 512 టీఎంసీ నీటిని కేసీఆర్‌తో ఒప్పించి సంతకం చేయించి చంద్రబాబు సాధిస్తే... సెక్షన్ 3పై చర్చించేలా జగన్‌రెడ్డి అపెక్స్ కౌన్సిల్‌లో వాదనలు వినిపించకుండా రాయలసీమకు ద్రోహం చేశాడు. నేడు తెలంగాణ ప్రభుత్వం నీటి కేటాయింపులపై డిమాండ్ చేస్తుందంటే జగన్ నిర్లక్ష్యపు ధోరణే కారణం. అలగనూరు బ్యాకేజీ జలాశయం గట్టు క్రిందికి కుంగిపోయింది. సెప్టెంబర్ 2021 నుంచి నీటి విడుదల ఆపేశారు. గాలేరు-నగరి ప్రాజెక్టుకు కీలకమైన గోరుకల్లు జలాశయం నిర్వహణ పట్టించుకోలేదు. అవుకు జలాశయం నిర్వహణను గాలికొదిలేశారు. ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు ఇవ్వకపోవడంతో తుంగభద్ర డ్యామ్ 19వ క్రస్ట్ గేట్ తెగిపోయి వేల క్యూసెక్కులు వృథాగా పోయాయి. శ్రీశైలం పంజ్వాల్‌ను పట్టించుకోలేదు. 2014-19 మధ్య కాలంలో గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, కేసీ కెనాల్, తుంగభద్ర ఎల్ఎల్సీ, హెచ్ఎల్సీ, వెలుగోడు రిజర్వాయర్, గోరుకల్లు, అలగనూరు, గండికోట రిజర్వాయర్, సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్ఆర్బీసీ, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, ఇలా రాయలసీమకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు చెందిన 102 పనులు చంద్రబాబు హయాంలో ప్రారంభించారు. రాయలసీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ రెడ్డి... 2019లో అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే జీఓ 365 తెచ్చి ఈ 102 ప్రాజెక్టులకు సంబంధించిన పనులను ప్రీ క్లోజ్ చేశాడు. రాయలసీమ రైతాంగానికి ఎంతో ఉపయోగకరమైన ఈ పనులన్నీ రద్దు చేశాడు. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కూడా సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేయలేదు.

**జగన్ పాపాలు... సీమ రైతులకు శాపాలు**

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు తీరని ద్రోహం చేసి, రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. 102 రాయలసీమ ప్రాజెక్టుల పనుల్ని జీఓ 365తో రద్దు చేసి రాయలసీమ రైతుల గొంతు కోశాడు. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాయలసీమకు రూ.2 వేల కోట్లు కూడా ఎందుకు ఖర్చు చేయలేదు. రాయలసీమ రైతులకు ఉపయోగకరమైన డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని రద్దు చేశాడు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39మంది చావుకు ఎవరు కారణమయ్యారు? హంద్రీనీవా కెనాల్ 1700 క్యూసెక్కుల సామర్థ్యాన్ని 3,500 క్యూసెక్కులకి పెంచలేకపోయాడు. జగన్ అసమర్థతతోనే రాయలసీమ లిఫ్టును ఎన్జీటీ ఆపేసింది. 2021లో ఆగిపోయిన లిఫ్ట్ పనులు నాలుగేళ్లల్లో అనుమతులు సాధించలేకపోయిన అసమర్థుడు జగన్.

**సాక్షి తప్పుడు కథనంపై వాస్తవాలు**

హంద్రీనీవా ఫేజ్-2 పనులను ఎన్సీసీ లిమిటెడ్‌కు పనులు నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అసలు గత ప్రభుత్వం (01.02.2023) హయాంలోనే ఈ ఒప్పందం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఆ పనులను కొనసాగిస్తున్నామన్నది జగన్ గ్రహించాలి.

పుంగనూరు బ్రాంచి కెనాల్ (పీబీసీ) 102.04 కి.మీ (బి.కొత్తకోట) -87.810 కి.మీ వద్ద లైనింగ్ దెబ్బతినడానికి 2025 సెప్టెంబర్‌లో కురిసిన అసాధారణ భారీ వర్షాలే కారణం. కొండచరియల నుండి, పైనున్న చెరువుల నుండి వచ్చిన వరద నీరు కాలువలోకి ఒక్కసారిగా చేరడంవల్ల గండిపడి లైనింగ్ దెబ్బతిన్నది. దీనిపై వైసీపీ పేటీఎం ముఠా ప్రభుత్వ వైఫల్యంగా చూపే విష ప్రయత్నం మొదలెట్టారు.

కుప్పం బ్రాంచి కెనాల్ నీటి విడుదల సమయంలో క్షేత్రస్థాయి తనిఖీల్లో పనులు పటిష్టంగా ఉన్నాయి. కుప్పం కాలువలో అసలు ఎస్ఎఫ్ఆర్సీ (స్టీల్ ఫైబర్ రీఇన్ఫోర్స్‌డ్ కాంక్రీట్) పనులే చేపట్టలేదు. అయితే అవి దెబ్బతిన్నాయని సాక్షి తప్పుడు కథనం అల్లేసింది.

వేరే ప్రాంతాలకు చెందిన ఫోటోలను తీసుకొచ్చి కుప్పం కాలువకు సంబంధించిన్నట్టుగా ప్రచురించి సాక్షి పరువు పోగొట్టుకుంది. ప్రస్తుతం హంద్రీనీవా ఫేజ్-2 పనులన్నీ పనులు నాణ్యత నియంత్రణ సిబ్బంది పర్యవేక్షణలో, నిర్ణీత ప్రమాణాల ప్రకారమే జరుగుతున్నాయి.

భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా 102.04 కి.మీ వద్ద "అండర్ టన్నెల్", 87.810 కి.మీవద్ద "ఇనలేట్ స్ట్రక్చర్" నిర్మాణానికి ప్రతిపాదనలు ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. డిజైన్ అనుమతులు రాగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైసీపీకి, జగన్‌రెడ్డికి రాయలసీమ ప్రజలు 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదు. తప్పుడు కథనాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కుట్రలు చేస్తోంది. ఇలాంటి ఫేక్ ప్రచారాలతో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఆపలేరని వైసీపీ నేతలు గ్రహించాలి.

**- ప్రవీణ్ బోయ**
**అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

## పేదవాడి కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్స్

**● కొవ్వూరులో పేదలకు భోజనం అందించిన ఎమ్మెల్యే ముప్పిడి**



కొవ్వూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ పుట్టినరోజు సందర్భంగా కొవ్వూరులోని అన్న క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి సహకారంతో అన్న క్యాంటీన్‌లో పేదలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం మరియు రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం రూ.5కి అన్న క్యాంటీన్స్ ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్స్ పనిచేస్తూ రోజుకు సుమారు 2.72 లక్షల మందికి భోజనం అందిస్తోందని, మూడు పూటల భోజనానికి రూ.75 ఖర్చు కాగా, ప్రజల నుంచి కేవలం రూ.15 మాత్రమే తీసుకుని మిగతా మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తోంది. ప్రతి క్యాంటీన్‌లో రోజుకు సగటున 1000 మందికి భోజనం అందుతోంది. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో రుచికరమైన, పౌష్టికాహారం అందిస్తున్నారు. పేదలు, కూలీలు, కార్మికులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

## అంతర్జాతీయ గుర్తింపు పొందిన నేత చంద్రబాబు

**●రంపచోడవరంలో అంబరాన్నంటిన చంద్రన్న జన్మదిన వేడుకలు**



రంపచోడవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికత అకుంఠిత దీక్ష గల సమర్ధ నాయకుడు అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం ఎన్టీఆర్ కూడలిలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్ అధ్యక్షతన, రంపచోడవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ సౌజన్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నేపథ్యంలో స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి చంద్రబాబునాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నారా చంద్రబాబునాయుడు 1950 ఏప్రియల్ 20వ తేదీన చిత్తూరు జిల్లా నారావారి పల్లెలో జన్మించారన్నారు. ఆయన విద్యార్థి దశ నుండి రాజకీయాలు, సమాజాభివృద్ధిపై మంచి అవగాహన కలిగి ఉండేవారన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన 28 సంవత్సరాల వయసులోనే చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచినట్లు 1980లో మంత్రిగా పని చేయటం అమోఘం అని కొనియాడారు.

## అఖండ గోదావరి సన్నిధిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



రాజోలు (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ జన్మదిన వేడుకలను రాజోలు నియోజకవర్గంలోని అంతర్వేదిలో పవిత్ర సాగర సంగమ ప్రాంతం గోదావరిలో బోట్లపై వినూత్నంగా నిర్వహించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పడవలను సీఎం చంద్రబాబు జండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గోదావరి మధ్యలో బోట్లపై ఏర్పాటుచేసిన పుట్టినరోజు కేకును అమూల్య కట్‌చేసి పంచారు. ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ 'పవిత్ర పుణ్యక్షేత్రం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలోని గోదావరి నదిమధ్యలో విజనరీ లీడర్ చంద్రబాబు జన్మదిన వేడుకలు మత్స్యకార సోదరుల మధ్య నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది' అన్నారు. భవిష్యత్తు తరాల కోసం ముందుచూపుతో ఆలోచన చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడిగా ఉండటం రాష్ట్రం అదృష్టమన్నారు. అనంతరం గోదావరి మధ్యలో బోట్లతో చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సఖినేటిపల్లి మండల తెలుగుదేశం అధ్యక్షులు తాడి సత్యనారాయణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార సమితి సభ్యులు తిరుమాని ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ చేసిన కిడారి శ్రావణ్ కుమార్



అరకు (చైతన్యరథం): అల్లూరి సీతారామ రాజు జిల్లా, అరకు నియోజకవర్గంలోని గూడా పంచాయతీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు గూడా సర్పంచ్ కంబిడి సరోజినీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహకాలు వంటి పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి నేరుగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## అన్నా క్యాంటీన్ పేద ప్రజలకు ఒక కల్పతరువు : ఎమ్మెల్యే బోనెల



పార్వతీపురం (చైతన్యరథం): అన్నా క్యాంటీన్ పేద ప్రజలకు ఒక కల్పతరువు అని, అన్ని దానాల కన్నా అన్నదానమే ప్రధానం అన్న సంకల్పం నారా భువనేశ్వరి ఆలోచన అని, అందుకే దాదాపు 78 లక్షల రూపాయల ఖర్చు పెట్టి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో ఈరోజు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా బెలగాంలో గల అన్నా క్యాంటీన్ వద్ద ఏర్పాటుచేసిన ఉచిత అన్నదాన కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. ముందుగా ప్రజలతో కలిసి భోజనం చేసి తమ అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ మేరకు ప్రజలు మాట్లాడుతూ ఇంతటి నాణ్యమైన భోజనాన్ని అన్నా క్యాంటీన్లో పెట్టడం ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మీరు ఆయురారోగ్యాలతో ఉంటూ మాలాంటి పేద ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని భగవంతుని వేడుకుంటున్నామని ప్రజలు ఎమ్మెల్యేతో అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్‌లను విస్మరించి పనికి రాకుండా చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పునరుద్ధరించి ప్రజలకు అన్నం పెడుతున్నారని అన్నారు. పండగ వాతావరణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు జరపడం హర్షణీయమన్నారు.

## ఐటీ రంగానికి పునాది చేసిన నాయకుడు చంద్రబాబు



గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు గన్నవరం నియోజకవర్గం మర్లపాలెం గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుయువత ఆధ్వర్యంలో గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం 76 కిలోల భారీ కేక్‌ను కూటమి నాయకులతో కలిసి కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్లపాలెం వద్ద రూ.74 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, గతంలో వివాదాలతో నిలిచిన గన్నవరం ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఐటీ రంగానికి పునాది వేసిన నాయకుడు చంద్రబాబునాయుడు అని అన్నారు. బిల్ గేట్స్ వంటి ప్రముఖులు కూడా చంద్రబాబు ప్రతిభను మెచ్చుకున్నారని పేర్కొన్నారు. క్వాంటంవ్యాలీ వంటి ప్రాజెక్టులను అమరావతితో పాటు గన్నవరం మేధా టవర్స్‌కు తీసుకువచ్చారని తెలిపారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల విరాళం అందించడం అభినందనీయమని తెలిపారు.

## ధాన్యం గింజలతో సీఎం చంద్రబాబు చిత్రపటం



కడియం (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ పుట్టినరోజు వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ధాన్యపు గింజలతో చంద్రబాబు చిత్రపటాన్ని రూపొందించారు. దీనిని తిలకించేందుకు పలువురు మంత్రులతోపాటు పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రధాతగా మారారని, అందుకు నిదర్శనమే ఆయన ఇటీవల రాష్ట్రానికి తీసుకువచ్చిన ఐటీ, ఇతర పరిశ్రమలు అని మంత్రులు కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు కొనియాడారు. ఈ కూర్పును ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, వెలుగు బంటి యూత్ సభ్యులను వారంతా ప్రత్యేకంగా అభినందించారు.

## పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి చంద్రబాబు

చీపురుపల్లి (చైతన్యరథం): సీఎం నారా చంద్రబాబు పేదలపాలిట పెన్నిధి అని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి వెంకటరావు అన్నారు. చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని అన్న క్యాంటీన్లో పేదలకు ఆయన భోజనాలు వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నిరంతరం పేదల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి అని అన్నారు. గత తెదేపా ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే వైకాపా ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక మళ్లీ వాటిని పునరుద్ధరించి పేదల ఆకలి తీరుస్తుందన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి రూ.273 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు దాతలు ముందుకు వచ్చి అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో చంద్రబాబు పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జననేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో చింతమనేని సందడి

●ఏలూరులో స్వయంగా తోపుడు బండి నడిపి రోగులకు పండ్ల పంపిణీ

●సర్వజన ఆసుపత్రిలో రోగులకు పరామర్శ



ఏలూరు (చైతన్యరథం): నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణ రూపకర్త, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ పుట్టినరోజు వేడుకలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. దెందులూరు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సందడితో ఏలూరు నగరం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని స్వయంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.

**సేవా దృక్పథం - రోగులకు పండ్ల పంపిణీ:**

వేడుకల్లో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తనలోని సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రికి మామిడి పండ్ల తోపుడు బళ్లను ఆయనే స్వయంగా నడిపించుకుంటూ తీసుకువెళ్లడం అందరినీ ఆకట్టుకుంది. ఆసుపత్రిలోని ప్రతి వార్డుకు వెళ్లి, చికిత్స పొందుతున్న రోగులను, వారి బంధువులను పలకరించి మామిడి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ..: "పేదల పాలిట పెన్నిధి, విజనరీ లీడర్ సీఎం చంద్రబాబునాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు.. ఆయన సతీమణి నారా భువనేశ్వరి రూ.76 లక్షల విరాళం అందించి రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో ఉచిత భోజనం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని అన్నారు. ఏలూరులోని స్టేట్ బ్యాంక్ వద్ద గల అన్న క్యాంటీన్ వద్ద ఉచిత భోజనానికి అదనంగా నాన్-వెజ్ వంటకాలను కూడా జత చేసి పేదలకు వడ్డిస్తున్నాం అని, సీఎం చంద్రబాబు విజన్ 2047 లక్ష్యం ఆయన సమక్షంలోనే నెరవేరి, రాష్ట్రం అగ్రస్థానంలో నిలవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు.

# సీఎం జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు (చైతన్యరథం): కొద్ది రోజుల విరామం తర్వాత ఏలూరు వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు పార్లమెంట్ పరిధిలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా ముందుగా ఉదయం తన నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు తీసుకువచ్చిన కేక్ కట్ చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, అనంతరం ఏలూరు టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి కట్ చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయం 11.30 సమయంలో తన క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేక్ కట్ చేసి, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలలో పాల్గొన్న అనంతరం వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న 60 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. రూ.64 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మధ్యాహ్నం 12.30 సమయంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద అన్నా క్యాంటీన్‌కు చేరుకున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. భోజనానికి వచ్చిన ప్రజలకు స్వయంగా వడ్డించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగవేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోగులు, వారి బంధువులు మరియు ఆస్పత్రికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే, ప్రజలు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు



మరియు ప్రజలు పాల్గొన్నారు.

# భీమడోలులో పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని



భీమడోలు (చైతన్యరథం): భీమడోలు వ్యాప్తంగా ఏపీ సీఎం చంద్రబాబునాయుడు జన్మదినోత్సవ వేడుకలను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల నడుమ ఘనంగా నిర్వహించారు. సోమవారం భీమడోలు టీడీపీ కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవకు ప్రాధాన్యతనిస్తూ 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి వారి రూపక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని పూజలు చేశారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌పేషెంట్లకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిత పాఠశాలలో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన గన్ని పాఠశాలలో త్రాగునీటి సమస్యను గుర్తించి రూ.15,000 విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేస్తామని గన్ని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాత, స్వర్ణాంధ్ర నిర్మాత సీఎం చంద్రబాబు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# కైకలూరులో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



కైకలూరు (చైతన్యరథం): నియోజకవర్గం కైకలూరు మండలం వరహాపట్నంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాహామీల కమిటీ ఛైర్మన్ - మాజీ మంత్రి... కామినేని శ్రీనివాస్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు అడవి కృష్ణ, బి.కె.యమ్ నాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ అంగ్రాజు శ్రీనివాసరావు, నాయి బ్రహ్మణ వెల్ఫేర్ డవలప్ మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ లంకా రత్నాకర్‌రావు, కలిదిండి మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కలిదిండి మండల టీడీపీ అధ్యక్షులు పోకల జోగిరాజు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షులు కోట కోటిలింగం బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరబత్తిన సుధ, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ యమ్.డి ఉస్మాన్, వరహాపట్నం మాజీ సర్పంచ్ బోయిన శ్రీనివాసరావు, టీడీపీ కో క్లస్టర్ పళ్ళెం తాతారావు, వెంకటాపురం మాజీ సర్పంచ్ కరేటి శ్రీహరి, దైతగుంజ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఉపాధి పరికరాలు పంపిణీ చేసిన టీడీపీ నేత దూండీ రాకేష్

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దూండి రాకేష్ అధ్యక్షతన అర్థవంతమైన సేవా కార్యక్రమం జరిగింది. క్షేత్రస్థాయిలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి, వారికి తక్షణ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఐటీడీపీ పశ్చిమ నియోజకవర్గం ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసింది. 41వ డివిజన్‌లో నివసిస్తున్న ఇద్దరు పేద మహిళల ఆర్థిక పరిస్థితిని ఐటీడీపీ పశ్చిమ నియోజకవర్గం బృందం క్షుణ్ణంగా పరిశీలించి, వారిని అసలైన లబ్ధిదారులుగా గుర్తించింది. ఈ విషయాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి దూండి రాకేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి తన సొంత ఆర్థిక సహకారంతో కింది పరికరాలను ఐటీడీపీ సభ్యుల సమక్షంలో అందజేశారు. అర్హులైన వారికే సహాయం అందాలన్నది మా లక్ష్యం. ఐటీడీపీ బృందం వెరిఫై చేసిన లబ్ధిదారులకు, అడగ్గానే ఆర్థిక సహాయం అందించిన దూండి రాకేష్‌కి పలువురు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉపాధి పరికరాల పంపిణీ



కార్యక్రమంలో ఐటీడీపీ ప్రతినిధులు స్రవంతి, సతీష్ మరియు ఐటీడీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు ఓ విజనరీ లీడర్

●కాకినాడలో అధినేత జన్మదిన వేడుకలు



కాకినాడ (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆదేశాల మేరకు కార్యాలయ ఇన్‌ఛార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి సీఎం చంద్రబాబునాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేకా లక్ష్మణ్ మూర్తి మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలవాలని సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన సూచనలను గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరవేసే వారే పార్టీకి అసలైన బలం అని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబునాయుడు తన దూరదృష్టి, విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి వంటి కీలక లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నారని, పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంచుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

## సింగ్‌నగర్ అన్నా క్యాంటీన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నారా భువనేశ్వరి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్నా క్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.76 లక్షల ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, దూరదృష్టి గల నాయకుడు నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ సింగ్ నగర్‌లోని అన్నా క్యాంటీన్‌ను బొండా ఉమామహేశ్వరరావు సందర్శించి కేక్ కట్ చేసి పేదలు, కూలీలు గౌరవప్రదంగా కడుపునిండా భోజనం చేయగలిగే విధంగా కొనసాగుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించి, స్వయంగా ఒక వృద్ధురాలికి భోజనం వడ్డించి సేవా భావాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... నవ్యాంధ్ర శిల్పి నారా చంద్రబాబునాయుడు నేడు 76వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, సాధారణ రైతు కుటుంబం నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం ఐదు దశాబ్దాల నిరంతర ప్రజాసేవతో చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందని పేర్కొన్నారు.

## విజయవాడ ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీ కేశినేని చిన్ని మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం కార్యకర్తల కోలాహలంతో పండుగలా సాగింది. ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు బొప్పాన భవ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ కేశినేని చిన్ని పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను వారు కట్ చేసి, చంద్రబాబునాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పరుచూరి అశోక్‌బాబు, బొప్పాన భవ కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు విజనరీ నాయకత్వం రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భవన్ వేదికగా జరుగుతున్న ఇటువంటి కార్యక్రమాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భవన్ ప్రాంగణం అంతా పార్టీ జెండాలు, పసుపు తోరణాలతో కళకళలాడింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు మరియు అభిమానులు 'జై బాబు' అంటూ చేసిన నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. కార్యక్రమం అనంతరం కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## నందిగామలో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు : పాల్గొన్న తంగిరాల సౌమ్య




నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి భారీ కేక్ కట్ చేసి చంద్రబాబుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రైతుపేట పార్టీ కార్యాలయంలో కూడా వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... "నాలుగు దశాబ్దాలుగా తెలుగుజాతిని ఉన్నతస్థానంలో నిలబెట్టిన విజనరీ నాయకుడు చంద్రబాబు నాకు, కోట్లాది యువతకు ఆదర్శం. ప్రజాసేవ, అభివృద్ధి పట్ల మా సంకల్పాన్ని ఆయన మార్గం బలపరుస్తోంది. ఆయనకు ఆయురారోగ్యం కలగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. వేడుకల అనంతరం సౌమ్య నందిగామ డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అలాగే నందిగామ సబ్ జైల్లో ముద్దాయిలకు పండ్లు అందజేయడం ద్వారా సేవా కార్యక్రమాలకు మరింత ప్రత్యేకతను చేర్చారు. ఈ కార్యక్రమాలలో వివిధ రాష్ట్ర కార్పోరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కూటమి నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను మరింత అర్థవంతంగా మార్చారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నో వేకెన్సీ బోర్డులు పెట్టాలి

**●అదే మంత్రి నారా లోకేష్ ఆకాంక్ష... పేదల బిడ్డలు బాగా చదువుకోవాలి: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



మైలవరం (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలలో నో వేకెన్సీ బోర్డులు, నో సీట్స్ అనే బోర్డులు పెట్టాలన్నదే మంత్రి నారా లోకేష్ ఆకాంక్ష అని ఆ దిశగా మైలవరం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో సోమవారం ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత ప్రతిభ చూపిన 157 మందికి విద్యార్థినులకు రూ.8.20 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదుతో పాటు వారి సతీమణి శిరీష, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, జిల్లా కలెక్టరేట్ జి.లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... "ఇటీవల ఆకస్మిక పర్యటనకు విచ్చేసిన సందర్భంగా కుంటముక్కల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు తరగతి గదుల్లోనే రాత్రుళ్లు నిద్రిస్తూ, మళ్ళీ అక్కడే విద్యాబోధన జరుగుతున్న విషయాన్ని స్వయంగా చూశానన్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న సమయంలో తన తండ్రి గారు ఈ పాఠశాలను శంకుస్థాపన చేసి ప్రారంభించారని, కార్యక్రమంలో నాలుగు దశాబ్దాల పాటు ఎంతమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ పాఠశాల శిథిలావస్థకు చేరిందన్నారు. మళ్ళీ తిరిగి ఇప్పుడు పాఠశాల నిర్మాణానికి తను ప్రభుత్వానికి రూ.4కోట్ల ప్రతిపాదనలు పంపినట్టు వెల్లడించారు. ఇందులో ఎంపీ నిధులు రూ.1.40 కోట్లు కాగా, డి.ఎం.ఎఫ్ నుంచి 2.60 కోట్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. మరో రూ.1కోటి సి.ఎస్.ఆర్ నిధులు తను వెచ్చించి రూ.5కోట్లతో పాఠశాల పునఃనిర్మాణం చేసున్నట్లు వెల్లడించారు. విద్యార్థిని, విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు.

## 76 ఏళ్ల వయసులో కూడా నిత్యవిద్యార్థి చంద్రబాబు

**●ముందు చూపు కలిగిన గొప్ప పరిపాలనాదక్షుడు**

**●సీఎం జన్మదిన వేడుకల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76 ఏళ్ల వయసులో కూడా నిత్య విద్యార్థిగా కొత్త విషయాలు ఆసక్తిగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను చైర్మన్ పట్టాభిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ... రాష్ట్రం, దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారి అభివృద్ధి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి గురించి ఆయన నిరంతరం ఆలోచన చేస్తుంటారన్నారు. భవిష్యత్తుని దృష్టిలోపెట్టుకుని ఆయన ఆలోచన చేస్తుంటారని, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అంచనావేగల సామర్థ్యం కలిగిన గొప్ప పరిపాలనాదక్షుడన్నారు. అయితే, గతంలో ఆయన కంప్యూటర్ టెక్నాలజీ గురించి మాట్లాడినప్పుడు కొంతమంది కంప్యూటర్, లాప్ ట్యాబ్, ఐటీ.... అవేమైనా కూడుపెడతాయా? అని ఎగతాళి చేశారని, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ.. వంటి వాటి గురించి కూడా అలాగే ఎగతాళి చేస్తున్నారన్నారు. ఆయన ప్రతిభకు తార్కాణమే హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ అని అన్నారు. ఇప్పటికీ 76 ఏళ్ల వయసులో ఆయన క్వాంటమ్ టెక్నాలజీ వంటి ఆధుని టెక్నాలజీ గురించే ఆలోచనలు చేస్తుంటారని, ఆయన ప్రతిభని అర్థంచేసుకోలేనివారు ఎగతాళి చేస్తూనే ఉంటారన్నారు. చంద్రబాబు నాయుడు నిర్వహించే రివ్యూ సమావేశాలలో పాల్గొన్నవారు. కొత్తకొత్త విషయాలను తెలుసుకొని స్ఫూర్తి పొందుతారని చెప్పారు. తాను కూడా ఏదోఒకటి తెలుసుకుంటానని, పోజిటివ్ ఎనర్జీ పొందుతానని చెప్పారు. గొప్ప వ్యక్తుల గురించి మనం తెలుసుకుని, వారి జీవితచరిత్రలు చదివి ఏదో ఒకటి నేర్చుకోవాలన్నారు.

## నిత్య శ్రామికుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**● విజయవాడలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధి కోసం పాటు పడుతున్న నిత్య శ్రామికుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ రామచంద్ర నగర్ లో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ప్రవీణ సేఫ్ విజన్ ఆసుపత్రి డాక్టర్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడుకు ఉన్న పాలనానుభవం, సమర్థత వల్లనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షోభంలోకి వెళ్ళిన రాష్ట్రం, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత సంక్షేమం వైపునకు అడుగులు వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్రంగా కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతతరం కష్టపడే శ్రామికుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధిని మరింత వేగంగా, సమర్థవంతంగా నడిపించే శక్తి ఆ భగవంతుడు వారికి ప్రసాదించాలని కోరుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఇక్కడ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

# వైసీపీ పేదల పొట్ట కొడితే.. మేం ఆకలి తీరుస్తున్నాం

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి రాక్షసుడిలా ఆలోచించి.. అన్నా క్యాంటీన్లను మూసేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని తిరిగి ప్రారంభించామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు.. పేదల కోసం నిరంతరం ఆలోచించే గొప్ప సీఎం చంద్రబాబు నాయుడు అని ఆయన కొనియాడారు. ఇంటి భోజనం కంటే నాణ్యంగా.. పేదలకు 5 రూపాయలకే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో ఉండే అన్ని అన్నా క్యాంటీన్లో ఇవాళ ఉచితంగా భోజనం అందిస్తున్నట్లు వెల్లడించారు.. ఈ సందర్భంగా నిరుపేదలతో కలిసి ఆయన అన్నా క్యాంటీన్ లో భోజనం చేశారు.. భోజనం రుచికరంగా ఉందా..? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడారు.. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నా క్యాంటీన్లను మూసేసి నిరుపేదల పొట్ట మీద కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి సొమ్ముతో లగ్జరీ జీవితానికి అలవాటు పడిన జగన్‌కు నిరుపేదల ఆకలి విలువ ఏం తెలుసని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు చంద్రబాబుకు ఉన్నాయి కాబట్టే మరోసారి అధికారంలోకి వచ్చి.. విధ్వంసానికి గురైన ఏపీని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని స్పష్టం చేశారు. సామాన్యులు నిరుపేదల జీవితాలతో ఆడుకున్నా ఏ రాజకీయ నాయకుడు బాగుపడినట్లు చరిత్రలో లేదని.. అది జగన్ విషయంలో స్పష్టమైనదని వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రంలో ఉండే అన్ని అన్నా క్యాంటీన్లో ఒక్కరోజు ఉచితంగా భోజనం పెట్టాలని నారా భువనేశ్వరి 76 లక్షలు విరాళం ఇచ్చారని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గుర్తు చేశారు. ఇవాళ పుట్టినరోజు జరుపుకుంటున్న చంద్రబాబు నాయుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోటంరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జెడ్ శివ ప్రసాద్, నెల్లూరు నగర మేయర్ సుజాత, డిప్యూటీ రూప్ కుమార్ యాదవ్ ,మామిడాల మధు, కువ్వారపు బాలాజీ, కిన్నెర మాల్యాద్రి, కొండా ప్రవీణ్ శంకర్ కొమరి విజయమ్మ, పొత్తూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పార్టీ నాయకులు

# ఘనంగా సీబీఎన్ జన్మదిన వేడుకలు

నెల్లూరు (చైతన్యరథం): చిన్న బజార్ స్టేట్ బ్యాంక్ రోడ్ సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ ధర్మవరం సుజాత రావు ఆధ్వర్యంలో, 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేశ్ కుమార్ భారీ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. బాణాసంచా కాల్చి, కాలనీ వాసులకు మిఠాయిలు పంచిపెట్టగా పిల్లలు, స్థానికులు, మహిళా విభాగం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారావు మాట్లాడుతూ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తక్కువ సమయంలోనే ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అర్హత కలిగిన నాయకుడని, రాష్ట్ర అభివృద్ధి దిశగా పరిశ్రమలు, కంపెనీలను ఆకర్షిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.

# దర్శిలో ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

**పాల్గొన్న దర్శి టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తదితరులు**



దర్శి (చైతన్యరథం): పట్టణంలోని గడియార స్తంభం వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు, నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా దర్శి టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి సొసైటీ అధ్యక్షులు కలువకొలను చంద్ర శేఖర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. తదుపరి పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ టిడిపి అధ్యక్షులు చిన్నా, మున్సిపల్ వైస్ ఛైర్మెన్లు తలారి కోటయ్య, గార్నిపూడి స్టివెన్, కౌన్సిలర్లు, వార్డ్ అధ్యక్షులు, గ్రామపార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇంచార్జిలు, నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# తిరుపతిలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

తిరుపతి (చైతన్యరథం): పట్టణంలోని నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్‌లో దివ్యాంగులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి ఘనంగా నిర్వహించారు. ఈ శుభ సందర్భంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. దివ్యాంగులకు అవసరమైన వినికిడి యంత్రాలను వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు స్కూల్ చైర్మన్ శ్రీధర్ ఆచార్య, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్, విభిన్న ప్రతిభావంతుల యువసేన నాయకులు రామాంజనేయులు, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చదువులతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలి

## విద్యార్థులకు వేమిరెడ్డి దంపతుల పిలుపు

బుచ్చిరెడ్డిపాలెం (చదువుతో పాటు క్రీడల పైనా విద్యార్థులు ఆసక్తి చూపాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పార్లమెంటరీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం చేసేందుకు బుచ్చి రెడ్డి పాళెం మండలం రేబాల గ్రామానికి వేమిరెడ్డి ప్రశాంతితో కలిసి వచ్చారు. ముందుగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ టోర్నమెంట్లో కోవూరుకు చెందిన సతీష్ లెవెన్ ప్రథమ బహుమతి అందుకోగా ద్వితీయ, తృతీయ స్థానాలలో నెల్లూరుకు చెందిన ఎన్ఎస్ఆర్ కోవూరుకు చెందిన కీరా 11 జట్లు గెలుచుకున్నాయి. కోవూరు కింగ్స్ 4వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలను క్రీడలు ప్రోత్సహించాలని తల్లి దండ్రులకు సూచించారు. నెల్లూరు జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కూటమి నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఘనంగా సీఎం చంద్రబాబు 76వ జన్మదిన వేడుకలు

**76 కేజీల భారీ కేక్ కట్ చేసిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలతో సందడి**




నంద్యాల (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టినరోజు వేడుకలు నంద్యాల పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సంబరాల్లో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, తులసి రెడ్డి, జిల్లెల్ల శ్రీరాములు, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ బాబాన్ ముఖ్య అతిథిలుగా పాల్గొని, పార్టీ శ్రేణుల మధ్య 76 కేజీల భారీ కేక్ కట్ చేశారు. యువత, పార్టీ కార్యకర్తల ఉత్సాహం మధ్య రక్తదాన శిబిరాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బెడ్ ను పంపిణీ చేసి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలకు, అభిమానులకు మధ్యాహ్నం భారీ విందు ఏర్పాటు చేయగా, పేదల కోసం ప్రత్యేకంగా నంద్యాల ప్రభుత్వ ఆస్పటల్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ అపర చాణక్యుడు, విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 76వ వసంతంలోకి అడుగుపెట్టడం మనందరికీ గర్వకారణం అన్నారు . ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని . సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలోనూ ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చంద్రబాబు ఎల్లప్పుడూ పెద్దపీట వేశారని . ఆయన నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని. పార్టీ కార్యకర్తలే చంద్రబాబుకు కొండంత అండ అన్నారు . ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

**మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు**

మడకశిర (చైతన్యరథం): మడకశిర క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నియోజకవర్గ ప్రజలతో నేరుగా మమేకమై వారి వినతులను స్వీకరించారు. ప్రతి అర్జీపై తక్షణమే స్పందించి, ఎలాంటి అధికారిక జాప్యం లేకుండా నిర్ణీత వ్యవధిలోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే సుపరిపాలనకు అసలైన గీటురాయి అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.



# విలక్షణంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

**ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు**



రాయదుర్గం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు రాష్ట్రానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వినూత్నంగా పది రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రగతి పండుగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఇవే కాకుండా నియోజకవర్గంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పేలా భువన విజయం సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ, బ్యాట్మింటన్ లాంటి క్రీడా పోటీలు, నిర్వహించారు. అలాగే భక్తులకు నిత్య అన్నదానం, వస్త్రదానం చేపట్టారు. యువత, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొనేలా కార్యక్రమాలు రూపకల్పన చేయడం విశేషం. ఈ కార్యక్రమాలు రాయదుర్గం నియోజకవర్గంలో ఆధ్యాత్మికత, అభివృద్ధి, సామాజిక చైతన్యాన్ని కలగలిపిన విధంగా పది రోజులపాటు కొనసాగాయి.

### ప్రగతి పథంలో రాయదుర్గం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా రూ.కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాయదుర్గం నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. రాయదుర్గం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సహకారంతో కొత్తగా నిర్మించిన సిమెంట్, తారు రోడ్లు, తాగునీటి పైపు లైన్, డ్రైనేజీ వ్యవస్థలు, భవనాలకు భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు జరిగాయి. ముఖ్యగా గోనబావిలో ఆగిపోయిన బాలికల ఆశ్రమ పాఠశాల రూ. 12కోట్లతో పునః ప్రారంభించారు. నేమకల్లులో రూ. 27కోట్ల విలువైన సూర్యాఘర్ పథకాన్ని ప్రారంభించారు. వీటితో పాటు గోకులం షెడ్లు, తాగునీటి పథకాలు, రాయదుర్గం ఆస్పత్రిలో తాగు నీటిశుద్ధి కేంద్రం ప్రజలకు అంకితం చేశారు. దేశం గర్వించతగ్గ జాతీయ నాయకులు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, మహర్షి వాల్మీకి విగ్రహాలను విష్కరించారు. రాయల నాటి చారిత్రక ఘట్టాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన భువన విజయం నాటకం ఆద్యాంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. యువ నాయకుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో కాలవ ఫౌండేషన్ క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ లాంటి పోటీలు నిర్వహించి క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. మరోవైపు పేదలకు ఇంటి పట్టాల పంపిణీ, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందచేశారు.



# ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

**మంత్రి సవిత ఆధ్వర్యంలో 76 మంది గర్భిణీలకు సామూహిక సీమంతాలు**

పెనుకొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, మంత్రి సవిత వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో 76 మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక మంతాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీలకు ఆశీర్వాదాలు అందజేసి, వస్త్రాలు అంద చేశారు. తల్లి శిశు ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను మంత్రి సవిత ఈ సందర్భంగా వివరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళల సంక్షేమం, గర్భిణుల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం ద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## శింగనమలలో ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

శింగనమల (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఏడీసీసీబీ చైర్మన్ కేశవ రెడి, రాష్ట్ర టీడీపీ మాజీ అధికార ప్రతినిధి ఆలం నరస నాయుడు, గార్లదిన్నె మండల కేంద్రంలోని శివాలయంలో చంద్రబాబు ఆయన కుటుంబ సభ్యుల పేర్ల మీద ప్రత్యక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాండు , గాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ విశాలాక్షి, సాగు నీటి సంఘాల చైర్మన్ శేఖర్, ఇతర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాకాలో ఘనంగా చంద్రన్న జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు 76 వ జన్మదినం సందర్భంగా, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అదేశాల మేరకు సోమవారం సూగురు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నందమూరి బాలకృష్ణ నిసాసంలో కేక్ కటింగ్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు వీరయ్య బాలాజీ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మాజీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప సీనియర్ నాయకులు నాగరాజు షఫీ ఉల్లా రూరల్ మండల్ అధ్యక్షుడు రాము చంద్రమోహన్ యాదవ్ అమర్నాథ్ పరిమళ డైమండ్ బాబా బాచి మంగేష్ దుర్గ నవీన్ సతీష్ కుమార్ రాఘవేంద్ర ఐటీడీపీ రాము నజీర్ శివకుమార్ మురళి సురేష్ అంజి మహేష్ హిందూపురం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రపంచవ్యాప్తంగా అంబరాన్నంటిన...

# సీబీఎన్ జన్మదినోత్సవ వేడుకలు

## ఎన్ఆర్ఐ టీడీపీ మెల్‌బోర్న్ ఆధ్వర్యంలో...

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను తెలుగు వారు అత్యంత వైభవంగా నిర్వహించారు. NRI TDP Melbourne Inc ఆధ్వర్యంలో "మన నాయకుడు–మన రాజధాని" నినాదంతో జరిగిన కార్యక్రమానికి భారీ స్పందన లభించింది.

ఈ వేడుకల్లో మెల్‌బోర్న్‌లో నివసిస్తున్న వందలాది తెలుగు కుటుంబాలు, యువతీ–యువకులు, ఎన్ఆర్ఐలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత 'మా తెలుగు తల్లి' గీతాన్ని ఆలపించారు. అనంతరం తెలుగు జాతి గర్వించదగ్గ మహా నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చిత్రపటం వద్ద ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

పలువురు వక్తలు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావం, నవ్యాంధ్ర నిర్మాణంలో ఆయన పోషిస్తున్న పాత్రను కొనియాడారు. అభిమానుల జయజయధ్వానాల మధ్య కేక్ కట్ చేశారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. "మన నాయకుడు... మన గర్వం" నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

కార్యక్రమాన్ని NRI TDP Melbourne Inc అధ్యక్షురాలు వినీల, ఉపాధ్యక్షురాలు కల్యాణి, అడ్వైజరీ సభ్యుడు బలుసు కిషోర్, పరిపూర్ణ, గోకుల్ లింగమనేని, రవితేజ, విలియమ్స్, దుర్గా ప్రసాద్, నవీన్ తదితరులు విజయవంతం చేశారు.

"మా నాయకుడి విజన్ మాకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకం. విదేశాల్లో ఉన్నా మా మాతృభూమి మరియు నాయకత్వంపై ఉన్న అనుబంధాన్ని ఈ వేడుకల ద్వారా చాటిచెప్పాము." అన్నారు నిర్వాహకులు. ఈ వేడుక మెల్‌బోర్న్ తెలుగు సమాజం ఐక్యతను, చంద్రబాబునాయుడు నాయకత్వంపై ఉన్న నమ్మకాన్ని మరోసారి నిరూపించింది.









## ఫ్రాంక్‌ఫర్ట్‌లో సంబరాలు

**ఫ్రాంక్‌ఫర్ట్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో కేక్ కట్ చేసి బెలూన్లు ఎగురవేశారు. జర్మన్ తెలుగుదేశం నాయకుడు శ్రీకాంత్ కుడితిపూడి మాట్లాడుతూ చంద్రబాబు గొప్ప దార్శనికుడు, దేశం గర్వించదగ్గ నేత అని కొనియాడారు. రాష్ట్ర విభజనతో రోడ్డునపడ్డ తెలుగు జాతికి పూర్వవైభవం తెచ్చేందుకు ఆయన అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అన్వేషిస్తున్నారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించి దాని నిర్మాణానికి అహోరాత్రులు శ్రమిస్తున్నారన్నారు. సమన్వయకర్త పవన్ కుర్ర మాట్లాడుతూ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మరో సమన్వయకర్త సుమంత్ కొర్రపాటి మాట్లాడుతూ చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆధునిక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ పటంలో గుర్తింపు తెచ్చారన్నారు.

## హాంబర్గ్‌లో సందడి

**హాంబర్గ్:** జర్మనీలోని హాంబర్గ్ నగరంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు జరిపారు. జ్యోతిప్రజ్వలన చేసి మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాట ఆలపించి కేక్ కట్ చేశారు. చంద్రబాబు రాజకీయ జీవితంలోని ముఖ్య ఘట్టాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ప్రముఖ జర్నలిస్ట్ శ్రీనివాస్ ప్రసాద్ రచించిన "చంద్రబాబునాయుడు X.0" పుస్తకం జర్మన్, ఫ్రెంచ్ భాషల అనువాద ప్రతులను పంపిణీ చేశారు. హాంబర్గ్ టీడీపీ టీం నుంచి డాక్టర్ శివశంకర్ లింగం, శశిధర్ ఏమిరెడ్డి, విక్రమ్ తల్లపనేని, దినేష్ పాకలపాటి, కిషోర్ దాసుగారి, శ్రీకాంత్ గోళ్ళ, రాజా పులిచర్ల, శివ కోలా, చైతన్య యలమంచి, యాగేష్, నాగేంద్ర కూతురు, వర్ఘుల చాణక్య, భరత్ శీలంనేని, లక్ష్మీ పెర్నీడు బొల్లెంపల్లి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. బ్రౌన్స్ వైగ్ నగరం నుంచి టిట్టు మద్దిపట్ల, హిల్డిస్ హైం నగరం నుంచి రామరాయలు వట్టికూటి, బ్రిమెన్ నగరం నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. తెలుగు సంఘం ప్రతినిధులు కూడా హాజరయ్యారు.








## ఈస్ట్ లండన్‌లో జయహో చంద్రన్న

**ఈస్ట్ హామ్ (లండన్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రదాత నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదిన వేడుకలు బ్రిటన్ రాజధాని లండన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈస్ట్ లండన్‌లోని ఈస్ట్ హామ్ ప్రాంతంలో ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి ఈ వేడుకలను ఒక పండుగలా నిర్వహించారు. అభిమానులు భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా "జై చంద్రబాబు", "జై తెలుగుదేశం" అంటూ చేసిన నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది, లండన్ వీధుల్లో తెలుగువారి ఆత్మగౌరవం ప్రతిబింబించేలా ఈ సంబరాలు సాగాయి. వేడుకల్లో పాల్గొన్న పలువురు వక్తలు చంద్రబాబునాయుడు ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడారు.

ప్రపంచవ్యాప్తంగా నేడు తెలుగువారు గర్వంగా, ఆత్మగౌరవంతో జీవిస్తున్నారంటే అది దశాబ్దాల క్రితమే చంద్రబాబు వేసిన ఐటీ, అభివృద్ధి పునాదుల వల్లేనని గుర్తు చేసుకున్నారు.

విభజన కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని తన అనుభవంతో మళ్లీ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు అమోఘమని ప్రశంసించారు.

చంద్రబాబునాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షించారు.

పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు, చిన్న పిల్లలు కేక్ కటింగ్ వేడుకలో పాలుపంచుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రవాస ఆంధ్రులకు వివరించారు. భవిష్యత్తులో యూకేలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని, మాతృభూమి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

# దక్షిణ కొరియాతో బంధం మరింత బలోపేతం



దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్ మూడురోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. ఇరు దేశాల సంబంధాలు

### ప్రధాని మోదీ లీజే మ్యూంగ్ సమక్షంలో పలు ఎంఓయూలు

బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోదీ లీజే మ్యూంగ్ సమక్షంలో సోమవారం పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. అధ్యక్షుడి పర్యటన ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక ముందడుగు అని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ, ఎంటర్టైన్మెంట్ నుంచి ఎనర్జీ వరకు ఇలా ప్రతి రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్లు తెలిపారు. భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

# చెప్పే వరకూ హర్మూజ్‌కు వెళ్ళొద్దు

## భారత్ నౌకలకు నేవీ అడ్వైజరీ జారీ




హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకాదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీపేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని చెప్పింది. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ (ఏప్రిల్ 18న). అదే రోజు జగ్ అర్జవ్, సన్మార్ హెరాల్డ్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా.. ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

# ఆకాశంలో హాహాకారాలు

## హైదరాబాద్ విమానం దారిమళ్లింపుతో ఆందోళన

హైదరాబాద్ నుంచి హుబ్లీ వెళ్లాల్సిన ఫ్లై 91 విమానాన్ని బెంగళూరుకు దారి మళ్లించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో విమానం గాల్లో ఉండగానే సాంకేతిక సమస్య ఎదురైనట్టు అధికారులు వెల్లడించారు. దీంతో విమానాన్ని దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని తెలిపారు. "ఆదివారం సాంకేతిక సమస్యల వల్ల విమానం మూడు గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కొందరు భయంతో బిగ్గరగా ఏడుస్తూ, క్షేమంగా కిందకు దిగాలని ప్రార్థనలు చేశారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలు సమయంలో హైదరాబాద్ నుంచి ఫ్లై 91 బయల్దేరింది. అది 4.30కి హుబ్లీ చేరుకోవాలి. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో దాన్ని బెంగళూరుకు దారి మళ్లించాల్సి వచ్చింది" అని సంబంధిత అధికారులు తెలిపారు. "ఆ తర్వాత ఫ్లై 91 బెంగళూరు నుంచి తిరిగి సాయంత్రం 6.30కు



ప్రారంభమైంది. హుబ్లీ చేరుకునేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. 22 మంది ప్యాసింజర్లు సురక్షితంగా ఉన్నారు" అని అధికారులు వెల్లడించారు. ఇదిలాఉండగా, వాతావరణ పరిస్థితుల వల్ల ముంబయి నుంచి కొల్హాపురు వెళ్లాల్సిన మరో విమానాన్ని గోవాకు మళ్లించారు. విమానంలో సమస్య ఏం లేదు. ఇందులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

# తప్పుడు దారిలో ర్యాపిడో డ్రైవర్

## తాట తీసిన మహిళా కస్టమర్




మన అవసరాల కోసం వ్యక్తిగత ఫోన్ నంబర్లతో క్యాబ్ బుకింగ్ సేవలను వినియోగించుకుంటాం. కొందరు క్యాబ్ డ్రైవర్లు ఇదే అదునుగా తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటారు. ఇటీవల ర్యాపిడో వినియోగించిన ఓ మహిళా కస్టమర్ కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. దీనిపై ఆ మహిళ సామాజిక మాధ్యమాల వేదికగా గళం ఎత్తడంతో ర్యాపిడో యాజమాన్యం స్పందించింది. ఓ మహిళ కస్టమర్ ర్యాపిడో బుక్ చేసుకున్నారు. తీరా గమ్యం చేరిన తర్వాత ఆ ర్యాపిడో డ్రైవర్ కస్టమర్ ఇచ్చిన ఫోన్ నంబర్ వాట్సప్లో కాంటాక్ట్ అయ్యాడు. అజ్ఞాత వ్యక్తిలా చాట్ చేయడం ప్రారంభించాడు. "మీరు చూడ్డానికి అందంగా ఉన్నారు.. మీ వయసెంత?" అంటూ చాట్ చేశాడు. దీనికి సంబంధించిన స్క్రీన్షాట్లను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనిపై ర్యాపిడో సంస్థ స్పందించింది. ఆ డ్రైవర్ అనుచిత ప్రవర్తనపై క్షమాపణలు కోరింది. రిజిస్టర్డ్ ఫోన్ నంబరు, రైడ్ ఐడీ ద్వారా సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చింది.

# టీవీకే అధినేతకు మద్రాసు హైకోర్టు నోటీసులు

## ఎన్నికల అఫిడవిట్లో అవకతవకలపై పిటిషన్



జారీ చేసింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లో అవకతవకలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన అనంతరం సోమవారం కోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. విజయ్ సమర్పించిన అఫిడవిట్లలో తేడాలున్నాయంటూ చెన్నైకి చెందిన వి. విఘ్నేశ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పోటీచేస్తున్నారు. పెరంబూర్లో సమర్పించిన అఫిడవిట్లో ఆయన ఆస్తుల వివరాలు రూ.115 కోట్లుగా ఉండగా తిరుచ్చిలో రిటర్నింగ్ ఆఫీసర్ కు ఇచ్చిన వివరాల్లో వెల్లడించిన ఆస్తులు విలువ రూ.220కోట్లుగా ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఇలా ఎందుకు తేడా చూపించాల్సి వచ్చిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాలు విజయ్ ఇవ్వలేదన్నారు. వచ్చేవారం దీనిపై తదుపరి విచారణ జరగనుంది.

# కర్ణాటక ఎమ్మెల్యే కుమారుల ఇళ్లలో ఈడీ సోదాలు

## మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ఏ హారిస్ కుమారులకు చెందిన ప్రాంగణాల్లో సోమవారం ఈడీ దాడులు నిర్వహించింది. క్రిప్టో కరెన్సీకి సంబంధించి మనీలాండరింగ్కు పాల్పడుతున్నట్లు వారిపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగిందని అధికారులు వెల్లడించారు. బెంగళూరులో మరికొన్నిచోట్లా ఈ సోదాలు జరిగినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కుమారులతో పాటు క్రిప్టో హ్యాకర్ శ్రీకృష్ణ రమేశ్ అలియాస్ శ్రీ కి చెందిన కార్యాలయాలను ఈడీ లక్ష్యంగా చేసుకుంది. శ్రీ తో పాటు అతడి సహాయకులు జాతీయ, అంతర్జాతీయ వెబ్సైట్లను హ్యాక్ చేసి, బిట్కాయిన్లను దొంగిలించారంటూ 2017లో పలు కేసులు, ఛార్జ్ షీట్లు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణలో భాగంగా తాజా సోదాలు జరిగాయి. క్రిప్టో నేరాల ద్వారా వచ్చిన ఆదాయం నుంచి ఎమ్మెల్యే కుమారులు కూడా లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. హారిస్, బెంగళూరులోని శాంతినగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు.



# ఉదంపూర్‌లో దుర్ఘటన : బస్సు లోయలో పడి 21 మంది మృతి

జమ్మూ, కాశ్మీర్లోని ఉదంపూర్ రూట్ లో వెళ్తున్న ఓ బస్సు లోయలో పడింది. ఈ విషాదకర ఘటనలో దాదాపు 21 మంది మృతి చెందగా చాలామందికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రామ్నగర్ నుంచి ఉధంపూర్ వెళ్తుండగా మధ్యలో జాలో అనే ప్రాంతంలో బస్సు ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉదంపూర్ డీఐజీ శివకుమార్ శర్మ పేర్కొన్నారు. "కొండ ప్రాంతంలో మలుపు వద్ద దారి కనిపించకపోవడం వల్లే ఉదయం సుమారు 10 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. భారీ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. 21 మంది మృతి చెందినట్టు గుర్తించాం. మరో 20 మందికి పైగా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్నాం. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది" అని డీఐజీ తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటానని, ఏమైనా అత్యవసరం అయితే స్పందించాలని జితేంద్ర సింగ్ వెల్లడించారు. బస్సు ప్రమాదంపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. ఉధంపూర్ వద్ద జరిగిన బస్సు ప్రమాదం హృదయ విదారకం. ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలి. క్షతగాత్రులు తొందరగా కోలుకోవాలని ఆశిస్తున్నా" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. హైదరాబాద్ నుంచి హుబ్లీ వెళుతున్న ఫ్లై 91 విమానాన్ని

## కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఆరా, తక్షణ సహాయ చర్యలకు ఆదేశాలు

బెంగళూరుకు దారి మళ్లించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో విమానం గాల్లో ఉండగానే సాంకేతిక సమస్య ఎదురైనట్టు అధికారులు వెల్లడించారు. దీంతో విమానాన్ని దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని తెలిపారు. "ఆదివారం రోజు సాంకేతిక సమస్యల వల్ల విమానం మూడు గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కొందరు భయంతో బిగ్గరగా ఏడుస్తూ, క్షేమంగా కిందకు దిగాలని ప్రార్థనలు చేశారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలు సమయంలో హైదరాబాద్ నుంచి ఫ్లై 91 బయల్దేరింది. అది 4.30కి హుబ్లీ చేరుకోవాలి. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో దాన్ని బెంగళూరుకు దారి మళ్లించాల్సి వచ్చింది" అని సంబంధిత అధికారులు తెలిపారు. "ఆ తర్వాత ఫ్లై 91 బెంగళూరు నుంచి తిరిగి సాయంత్రం 6.30కు ప్రారంభమైంది. హుబ్లీ చేరుకునేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. 22 మంది ప్యాసింజర్లు సురక్షితంగా ఉన్నారు" అని అధికారులు వెల్లడించారు. ఇదిలాఉండగా, వాతావరణ పరిస్థితుల వల్ల ముంబయి నుంచి కొల్హాపురు వెళ్లాల్సిన మరో విమానాన్ని గోవాకు మళ్లించారు. విమానంలో సమస్య ఏం లేదు. ఇందులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

# అప్పుడు.. ట్రంప్ అరిచేశారు



- **ఇరాన్ దెబ్బకు కూలిన ఎఫ్-15 ఈగిల్ ఫైటర్ జెట్**
- **ఆ ఘట్టంలో 'వార్ రూమ్'లో కంట్రోల్ తప్పిన ట్రంప్?**

ఇరాన్‌లో ఎఫ్-15ఈ యుద్ధ విమానం కూలిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన అనుచరులపై అరిచారు. జరుగబోయే పరిణామాలపై ఆయన తీవ్ర ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఆయన అనుచరులు ట్రంప్‌ను 'వార్ రూమ్'నుంచి దూరంగా ఉంచారని ది వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ఏప్రిల్ 3న అమెరికాకు చెందిన ఎఫ్-15 ఈగిల్ ఫైటర్ జెట్‌ను ఇరాన్ కూల్చివేసింది. ఒక పైలట్ ఆచూకీ తెలియగా మరో వైమానికుడి జాడ తెలియలేదు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనవారిపై అరిచారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్‌తో సహా సీనియర్ అధికారులపై పలు గంటలపాటు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంక్షోభం ముదురుతున్న కొద్దీ కీలకమైన వార్ రూమ్ బ్రీఫింగ్‌లకు ట్రంప్‌ను దూరంగా ఉంచినట్లు సీనియర్ అధికారులు చెప్పారని వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. మరోవైపు ఇరాన్‌తో సంఘర్షణ సాగుతున్న తీరుపై ట్రంప్‌లో భయాలు పెరిగినట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ రిపోర్ట్ పేర్కొంది. అత్యంత ముఖ్యమైన అమెరికా విదేశాంగ విధాన సంక్షోభాలలో ఒకటైన ఇరాన్ బందీల సంక్షోభం ఆయన మనసులో మెదిలినట్టు తెలిపింది. జిమ్మీ కార్టర్ హయాంలో హెలికాప్టర్లు, బందీలతో గందరగోళం, ఎన్నికల్లో ఓటమిని తెచ్చిపెట్టడంవంటి పరిణామాలు మళ్లీ జరుగుతాయని ట్రంప్ ఆందోళన చెందినట్లుగా ఆయన పాలనా అధికారి పేర్కొన్నట్లు వెల్లడించింది. అయితే వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికను వైట్‌హౌస్ ఖండించింది. ట్రంప్ మన దేశానికి అవసరమైన స్థిరమైన నాయకుడిగా నిలిచారని ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని ఇరాన్‌కు నిరాకరించాలన్న ట్రంప్ లక్ష్యానికి అనుగుణంగానే ఆ దేశంపై మిలిటరీ ఆపరేషన్ ఉన్నదని ఆమె అన్నారు.

# రెండో విడత చర్చలపై ముందుకు కదలని ఇరాన్

### అమెరికా ద్వంద్వ వైఖరే కారణమని వ్యాఖ్య



అమెరికాతో జరగాల్సిన రెండో విడత చర్చల్లో పాల్గొనడంపై ఇప్పటివరకు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సోమవారం ఇరాన్ స్పష్టంచేసింది. వాషింగ్టన్ నుంచి వైరుధ్యపూరిత చర్యలు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ వైఖరి తీసుకున్నట్టు తెలిపింది. టెహ్రాన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేయి ఈ విషయాలు వెల్లడించారు. తదుపరి చర్చల గురించి తామింకా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. దౌత్యమార్గాన్ని అనుసరిస్తున్నామని చెబుతూనే అమెరికా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి విమర్శించారు. కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభంనుంచే అమెరికా నుంచి తమకు వ్యతిరేకత ఫిర్యాదులు ఎదురయ్యాయని బాఘేయి పేర్కొన్నారు. తాజాగా ఆదివారం రాత్రి హర్మూజ్ జలసంధిలో ఇరాన్ వాణిజ్య నౌకపై అమెరికా దాడి చేసిందని, ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, దురాక్రమణ చర్య అని ఆరోపించారు. కాగా అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఇరాన్ కార్గో షిప్‌ను అడ్డగించి, స్వాధీనం చేసుకున్నామని ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని బఘేయి ప్రస్తావిస్తూ.. అమెరికా చర్యల్లోని ఈ అస్థిరత, చర్చల ప్రక్రియపై తమకున్న అపనమ్మకాన్ని మరింత పెంచుతోందన్నారు. గతంలో అమెరికా రెండుసార్లు దౌత్యానికి ద్రోహం చేసిందని, తమ సార్వభౌమత్వంపై దాడి చేసిందని గుర్తుచేశారు. ఈ అనుభవాలను విస్మరించలేమని, జాతీయ ప్రయోజనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే భవిష్యత్ మార్గంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. మంగళవారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో చర్చలు ఉంటాయని ట్రంప్ చెబుతున్న నేపథ్యంలో.. ఇరాన్ తాజా ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### యూఎస్‌లో సుంకాల రీఫండ్

# నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ




ఎమర్జెన్సీ చట్టం కింద కంపెనీలనుంచి వసూలు చేసిన దిగుమతి సుంకాలను రీఫండ్ చేసేందుకు అమెరికా ప్రభుత్వం సిద్ధమైంది. సుంకాల విధింపు రాజ్యాంగ విరుద్ధమన్న సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం నేటినుంచీ దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందించింది. స్థానిక కాలమానం ప్రకారం, సోమవారం ఉదయం 8.00 గంటలనుంచి దిగుమతిదారులు రీఫండ్స్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చని పేర్కొంది. ఎమర్జెన్సీ చట్టాలను ఉపయోగించి ట్రంప్ ప్రభుత్వం దిగుమతి సుంకాలను విధించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. చట్టసభల అధికారాల్లోకి ట్రంప్ ప్రభుత్వం జోక్యం చేసుకుందని కోర్టు అభిప్రాయపడింది. కంపెనీలనుంచి వసూలు చేసిన నిధులను తిరిగిచ్చేయాలని కూడా స్పష్టం చేసింది. ఇక ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, కంపెనీలు తాము ఏయే ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు చెల్లించిందీ వివరిస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత 60నుంచి 90 రోజుల్లో ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. కొన్ని సందర్భాల్లో రీఫండ్ జాప్యమయ్యే అవకాశం ఉందని కూడా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమెరికా మీడియా కథనాల ప్రకారం, దాదాపు 3.3 లక్షలమంది దిగుమతిదారులు 166 బిలియన్ డాలర్ల మేర దిగుమతి సుంకాలను చెల్లించారు. మొత్తం 53 మిలియన్ షిప్‌మెంట్స్‌పై ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారు. ఈ నిధులను ప్రభుత్వం దశలవారీగా రిఫండ్ చేయనుంది.

# భారత నౌకలపై దాడులు

### దర్యాప్తు చేస్తున్నామన్న ఇరాన్



హర్మూజ్ జలసంధిలో భారత నౌకలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగాయనే వార్తలపై ఇరాన్ స్పందించింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు. భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అనే అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. కాల్పులు జరిగినట్టు ధ్రువీకరణ కాలేదని, అయితే ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున వాటిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో శనివారం రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీ కాల్పులు జరిపినట్టు వార్తలు వచ్చాయి. ఐఆర్‌జీసీ అనుమతి లభించిన తర్వాతే ఆ రెండు నౌకలు హర్మూజ్‌లోకి ప్రవేశించాయి. అయినప్పటికీ వాటిపై దాడి జరిగింది. ఈ ఘటనపై సీరియస్ అయిన కేంద్ర ప్రభుత్వం భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది 'భారత నౌకలను మా దళాలే లక్ష్యంగా చేసుకున్నాయా? అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయి' అని ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు.

# జపాన్‌లో భారీ భూకంపం

### రిక్టర్ స్టేలుపై 7.4గా నమోదు - సునామీ హెచ్చరికలు జారీ



జపాన్‌లో సోమవారం శక్తివంతమైన భూకంపం నమోదైంది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.4గా ఉంది. దీంతో జపాన్ వాతావరణ శాఖ సునామీ వార్నింగ్ జారీ చేసింది. సుమారు మూడు మీటర్ల ఎత్తుతో సముద్ర అలలు ఎగిసిపడే అవకాశాలు ఉన్నట్టు పేర్కొంది. ఉత్తరంలోని ఇవాటే రాష్ట్ర సమీప జలాల్లో భూకంప కేంద్రం ఉన్నట్లు భావిస్తున్నారు. చాలా శక్తివంతంగా భూమి కంపించడంతో.. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యోలో కూడా బిల్డింగ్‌లు కంపనానికి గురైనట్టు తెలుస్తోంది. ఉత్తర తీరానికి సునామీ అలలు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ ఏజెన్సీ పేర్కొన్నది. కోస్టల్ ప్రాంతాల నుంచి తరలివెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. సునామీ అలలవల్ల డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉన్నట్టు చెప్పారు. హెచ్చరికను వెనక్కి తీసుకునే వరకు ఎవరూ తీరానికి వెళ్లకూడదని ప్రభుత్వం పేర్కొంది. క్రైసిస్ మేనేజ్మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# అమెరికాలో కాల్పులు

### - 8మంది పిల్లలు దుర్మరణం

అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ష్రెవెపోర్ట్‌లోని నివాస సముదాయంలో ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. పక్కపక్కనే ఉన్న మూడుచోట్ల కనిపించిన 10 మందిపై కాల్పులు జరపగా.. అందులో ఏడాది నుంచి 14 ఏళ్ల వయసులోపున్న 8మంది పిల్లలు మృతి చెందారు. కాల్పుల అనంతరం నిందితుడు కారులో పారిపోయే ప్రయత్నం చేయగా.. పోలీసులు వెంబడించారు. ఈ నేపథ్యంలోనే పోలీసుల కాల్పుల్లో నిందితుడు మరణించాడు. కాల్పులకు గురైన వారిలో నిందితుడి బంధువులు కూడా ఉన్నట్టు సమాచారం. ఇటు అయోవా నగరంలోని ఓ బార్ ముందర గొడవ జరిగి అది కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో అయోవా విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.



## పంజాబ్ జైత్రయాత్ర..

**- వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ గెలుపు**



మల్లన్‌పూర్: ఈ ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ అంచనాలకు మించి రాణిస్తోంది. వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ ఓటమనేదే లేకుండా పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (37 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్సలతో 93), కూపర్ కనోలి (46 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సలతో 87) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆపై బౌలర్లు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను కట్టుదిట్టం చేయడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 54 పరుగుల తేడాతో పంజాబ్ భారీ విజయాన్నందుకుంది. ప్రస్తుతం పంజాబ్ 11 పాయింట్లతో టాప్‌లో ఉంది. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 254 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో ఈ జట్టుకిది రెండో అత్యధిక స్కోరు. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 200/5 స్కోరుకే పరిమితమై ఓడింది. సారథి రిషభ్ పంత్ (23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సలతో 43), మార్‌క్రమ్ (22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలతో 42), మార్ష్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 40), ఆయుష్ బదోని (21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35) రాణించారు. యాన్సెన్ 2 వికెట్లు తీశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రియాన్ష్ నిలిచాడు.

## అమ్మాయిలకు రెండో ఓటమి




డర్బన్: దక్షిణాఫ్రికాతో రెండో టీ20లోనూ భారత మహిళలు ఓటమి పాలయ్యారు. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో సఫారీలు 8 వికెట్లతో ఘన విజయం సాధించారు. తొలుత భారత్ 20 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. షఫాలీ (57), అనుష్క శర్మ (28) మినహా అంతా విఫలమయ్యారు. ట్రయన్, శెఖుఖునె చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం కెప్టెన్ వోల్వార్ట్ (54), సునె లుస్ (57) హాఫ్ సెంచరీలతో మెరవడంతో దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 148/2 స్కోరుతో లక్ష్యాన్ని ఛేదించింది. శ్రేయాంక 2 వికెట్లు పడగొట్టింది. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో సఫారీ జట్టు 2-0 ఆధిక్యంలో ఉంది.

# ఒకేసారి రెండు టీ20 జట్లు!

### సంచలన నిర్ణయం దిశగా బీసీసీఐ

భారత జట్టులో చోటు కోసం తీవ్రంగా పోటీ నడుస్తోన్న సంగతి తెలిసిందే. యువ ప్లేయర్లు అందరూ తమ ప్రతిభను నిరూపించుకుంటూ టీమిండియాలో స్థానం కోసం శ్రమిస్తున్నారు. దానికి ఫ్రాంచైజీ క్రికెట్ ఒక ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తోంది. టాప్ ప్లేయర్లు మాత్రమే కాకుండా దేశవాళీల్లో, ఐపీఎల్‌లో సత్తా చాటుతోన్న యువ ప్లేయర్లకు అవకాశం ఇవ్వడం బీసీసీఐకు పెద్ద సవాలుతో కూడుకున్న పనే. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఓ సంచలన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రతిభ కలిగిన ప్రతి ప్లేయర్‌కు అవకాశం ఇచ్చే దిశగా నడుస్తోన్నట్టు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. భారత జట్టులోకి రావడానికి అందుబాటులో ఉన్న ప్లేయర్ల సంఖ్య ఆధారంగా కనీసం 30 నుంచి 35 మందితో బీసీసీఐ ఓ జాబితా ను సిద్ధం చేయనుంది. ఒకేసారి రెండు జట్లు బరిలోకి దిగేలా




ప్రణాళికలను రచిస్తోంది. అంతర్జాతీయంగా ఉన్న సిరీస్‌ల దృష్ట్యా దీనిని వర్కౌట్ చేసేందుకు కార్యాచరణను మొదలుపెట్టి నట్టు సమాచారం. అందుకు ఆసియా గేమ్స్, వెస్టిండీస్ సిరీస్ వేదికయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో అద్భుత మైన ఫామ్‌లో ఉన్న బ్యాటర్ శ్రేయస్ అయ్యర్.. అటు కెప్టెన్సీ పరంగానూ అదరగొడుతున్నాడు. అయ్యర్‌కు ఓ జట్టు బాధ్యతలు అప్పగించే దుకు రంగం సిద్ధమవుతోంది. రెండో జట్టుకు కెప్టెన్‌గా సూర్యకు మార్ యాదవ్ లేదా మరెవరైనా ఉండొచ్చు. 'ఆసియా గేమ్స్, వెస్టిండీస్ సిరీస్ దాదాపు ఒకే సమయంలో రానున్నాయి. అందుకే రెండు టీమ్‌లను బరిలోకి దింపేందుకు సిద్ధమవు తున్నాం. దాని కోసం 30 నుంచి 35 మందితో కూడిన జాబితా రెడీ అవుతోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం ఈ లిస్ట్‌లో నుంచి ఎంపిక చేసే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్న యువ ప్లేయర్లకు ఇది సదావకాశం. రెండు టీమ్‌లూ బలంగా ఉండాలనే లక్ష్యంతో బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది' అని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు.

# సిక్సర్ల పిడుగు సూర్యవంశీ మళ్లీ ఏడ్చేశాడు..

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట ఆర్ఆర్‌కు ఓపెనర్లు బలమైన పునాది వేసి నా.. ఆ జట్టు ఉపయోగించుకోలేకపోయింది. ఫామ్ అందుకున్న వరుణ్ చక్రవర్తి ధాటికి విలవిలలాడి ఆర్ఆర్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. అయితే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (46) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. వైభవ్ మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపో యారు. స్వల్ప లక్ష్యాన్ని కేకేఆర్ బ్యాటర్లు ఛేదించి గెలిచేశారు. అయితే వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ కుర్రాడు తమ జట్టు ఓడిపో యిందని కన్నీళ్లు పెట్టుకున్నాడు మరి! ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్‌తోనూ ఆర్ఆర్ ఓడిన సంగతి తెలిసిందే. అప్పుడు కూడా వైభవ్ ఏడ్చేశాడు. జట్టు కోసం ఎక్కువ పరుగులు చేయలేకపోయానని బాధ పడ్డాడు. తాజాగా కేకేఆర్‌పై ఓటమి తర్వాత ఓ మూలన కుర్చొని వైభవ్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. క్యాప్‌తో ముఖాన్ని



దాచుకుంటూ బాధను వ్యక్తం చేశాడు. ఆ సమయం లో కేకేఆర్ సిబ్బందిలో ఒకరు అతడి వద్దకు వచ్చి ఓదార్చారు. వైభవ్ పక్కన కూర్చొని కాసేపు మాట్లాడి, ఆలింగనం చేసుకుని ధైర్యం చెప్పారు. ఫోన్‌లో తమ తల్లిదండ్రులతో మాట్లాడుతూ కూడా సూర్యవంశీ ఏడ్చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో లు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 15 ఏళ్ల కుర్రాడి మనస్తత్వం ఇలాగే ఉంటుందని, ఆ వయసులో ఉంటే తాము కూడా ఏడ్చేసేవాళ్లమంటూ నెటిజన్లు సరదాగా కామెంట్లు పెడుతున్నారు. .ప్రస్తుత సీజన్‌లో సూర్యవంశీ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆరు మ్యాచ్‌లలో 246 పరుగులు చేసి టాప్ రన్ గెటర్లలో నాలుగో స్థానంలో నిలిచాడు. రెండు హాఫ్ సెంచరీలతో పాటు 78 అత్యధిక స్కోర్‌గా నమోదు చేశాడు. మొత్తం ఐపీఎల్ కెరీర్‌లో 13 మ్యాచ్‌లలో 498 పరుగులు చేసి తన ప్రతిభను మరింత బలంగా నిరూపిస్తున్నాడు. ఓటమి బాధతో కన్నీళ్లు పెట్టు కున్నా... ఈ యువ ఆటగాడి ప్రతిభ మాత్రం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు పెద్ద ఆశగా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# టైటిల్ గెలిచినంత ఆనందంగా ఉంది

### కేకేఆర్ బౌలర్ వరుణ్ చక్రవర్తి భావోద్వేగం

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఐదు మ్యాచుల ఓటమి తర్వాత ఆదివారం మ్యాచ్‌లో విజయం సాధించడంతో ఆ జట్టు సభ్యులు భావోద్వేగానికి గుర య్యారు. డ్రెస్సింగ్ రూమ్‌లో దాదాపు ప్రతిఒక్కరూ కన్నీళ్లు పెట్టు కున్నారని మిస్టరీ స్పిన్నర్, కేకేఆర్ బౌలర్ వరుణ్ చక్రవర్తి వెల్లడిం చాడు. 2024లో ఛాంపియన్‌గా నిలిచిన సమయంలో కూడా ఇలాంటి దృశ్యాలను చూడలేదని తెలిపాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 155 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో కోల్‌కతా నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడు వికెట్లు



తీసిన వరుణ్ చక్రవర్తి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. ఈ సీజన్‌లో కేకేఆర్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. ఈ మ్యాచ్ కంటే ముందు ఆడిన ఆరు మ్యాచులకు గాను ఐదింట్లో ఓడగా.. మరొక మ్యాచ్ వర్షం కారణగా రద్దైం ది. మొత్తంగా ఏడో మ్యాచ్‌లో కేకేఆర్ జట్టు విజయకేతనం ఎగరేసింది. దీంతో జట్టులోని సభ్యులంతా ఎమోషనలయ్యారు. మ్యాచ్ అనంతరం వరుణ్ చక్రవర్తి మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. అంతేకాక మా డ్రెస్సింగ్ రూమ్‌లో ఎన్నో కన్నీళ్లను చూశా. పదేళ్ల తర్వాత మేము 2024లో మూడోసారి ఛాంపియన్‌గా నిలిచాం. కానీ, ఆ సమయంలో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించలేదు. మా కోచింగ్ బృందానికే ఈ గెలుపు క్రెడిట్ దక్కుతుంది. బయట మాపై వస్తోన్న సెటైర్లు, విమర్శలను మా వరకు చేరకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. చాలామంది అర్థరహితంగా మాపై నిందారోపణలు చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మాకు మద్దతుగా ఉన్న కేకేఆర్ మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు. ఇప్పుడు విజయంతో మా అడుగు మొదలుపెట్టాం. రానున్న రోజుల్లో కూడా ఇదే కొనసాగుతుందని భావిస్తున్నా' అని వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు.

# టీ20 ఫ్రాంచైజీ సహ యజమానిగా గేల్

యూనివర్సల్ బాస్.. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. యూరప్‌లో ఐసీసీ ఆమోదం పొందిన తొలి ఫ్రాంచైజీ టోర్నమెంట్‌గా రూపొందుతున్న యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో గేల్ భాగమయ్యాడు. గ్లాస్గో ముగాఫియన్స్ అనే జట్టుకు సహ యజమానిగా వ్యవహ రించనున్నాడు. భారత వ్యాపారవేత్త తాన్నా బాత్రా, గేల్ కలిసి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేశారు. అంతేకాకుండా క్రిస్ గేల్ ఈ జట్టుకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిబర్‌గా కూడా నియమి తుడయ్యాడు. ఫ్రాంచైజీ లాంచ్ సందర్భంగా గేల్ మాట్లాడాడు. 'కో ఓనర్‌గా ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం నాకు ఎంతో ఉత్సాహంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లలో ఆడిన అనుభవంతో ఈటీపీఎల్‌లో భాగమయ్యాను. ఈ టోర్నీ కూడా ఒక ప్రత్యేక స్థానం సంపాదిస్తుందని నమ్ముతు న్నాను. మరోవైపు తాన్నా బాత్రా కూడా ఈ ఫ్రాంచైజీ ద్వారా స్కాట్లాండ్ క్రికెట్‌ను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు' అని గేల్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ది యూరోపియన్ టీ20 ప్రిమియర్ లీగ్‌లో ఆరు జట్లు భాగం కానున్నాయి. స్కాట్లాండ్ దేశం నుంచి ఈ గ్లాస్గో ముగాఫియన్స్ ప్రాతినిధ్యం వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్‌లన్నింటిలో కలిపి గేల్ ఏకంగా 463 మ్యాచ్‌లు ఆడాడు. ఇప్పుడు ఫ్రాంచైజీకి కో ఓనర్‌గా కొత్త అధ్యాయం ప్రారంభించాడు. కాగా ఈ టోర్నమెంట్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఈటీపీఎల్‌కు బాలీవుడ్ ప్రముఖ నటుడు అభిషేక్ బచ్చన్ కూడా సహ యాజమానిగా ఉన్నాడు.



ఈ టోర్నీలో క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్ భాగస్వామ్యం అయ్యాయి. గ్లాస్గో, ఆమ్‌స్టర్‌డ్యామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్ బెల్‌ఫాస్ట్, రాటర్‌డ్యామ్ రూపంలో ఆరు జట్లు ఈ లీగ్‌లో భాగంగా ఉన్నాయి. ఆమ్‌స్టర్‌డ్యామ్ ఫ్రాంచైజీని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా, హాకీ స్టార్ జెమీ డ్వైయర్ సొంతం చేసుకున్నారు. ఈ జట్టుకు ఆసీస్ టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

చైతన్య రథం సినిమా
మంగళవారం 21 ఏప్రిల్ 2026 X

# బాంబ్ పేల్చిన శివాజీ..




ప్రస్తుతం బాలీవుడ్ సినిమానుంచి రాబోతున్న అవైటెడ్ సినిమాల్లో రాజా శివాజీ ఒకటి. రితేష్ దేశ్‌ముఖ్ హీరోగా నటించిన భారీ హిస్టారికల్ సినిమాలో -ఛత్రపతి శివాజీ మహారాజ్‌గా కనిపించనున్నాడు రితేష్. అయితే తన స్క్రీన్ ప్రెజెన్స్ విషయంలో ఇటీవల పలు ట్రోల్స్ వచ్చాయి. కానీ తాము మాత్రం సినిమాపై గట్టి కాన్ఫిడెంట్‌గానే ఉన్నాడు. ఇదిలావుంటే, హీరో రితేష్, భార్య జెనీలియా కలిసి బిగ్ బాస్ మరాఠి షోకి హాజరయ్యారు. అందులో ఓ సర్‌ప్రైజింగ్ క్యామియో కోసం రితేష్ చేసిన రివీల్ బిగ్ అప్డేట్‌గా మారింది. తమ సినిమాలో బాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్స్‌లో ఒకరైన సల్మాన్ ఖాన్ కూడా కనిపించబోతున్నారని రివీల్ చేయడం ఇప్పుడు క్రేజీగా మారింది. దీనితో ఆ షో కంటెస్టెంట్స్ కూడా ఇది విని షాకయ్యారు. సో సల్మాన్ ఈ సినిమాలో ఏ పాత్రలో కనిపించనున్నారో చూడాలి. ఇక ఈ సినిమాకి రితేషే దర్శకత్వం కూడా వహించగా.. అభిషేక్‌బచ్చన్, సంజయ్‌దత్ తదితరులు సినిమాలో నటించారు. అలాగే ఈ సినిమా ఈ మే1న గ్రాండ్‌గా విడుదల కానుంది.

### జన నాయగన్ తరువాతగానీ

# మెగా మొదలుకాదు?




ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్న లేటెస్ట్ సినిమానే తన 158వ సినిమా అని చెప్పాలి. బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం వాల్తేరు వీరయ్య అందించిన దర్శకుడు బాబీ కొల్లితో మరోసారి మెగాస్టార్ సినిమా అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై మంచి హైప్ నెలకొంది. అలాగే డాకు మహారాజ్‌లాంటి సాలిడ్ వర్క్ బాబీ నుంచి పడేసరికి మెగాస్టార్‌తో కనుక ఆ తరహా సినిమా చేస్తే అది నెక్స్ట్ లెవెల్లో బాక్సాఫీస్ దగ్గర వర్క్ అవుతుంది అని అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ఈ సినిమా ఇంకా మొదలు కాకపోవడం మాత్రం వారిని ఒకింత డిజప్పాయింట్ చేస్తుంది. నిజానికి ఈ ఏప్రిల్‌లోనే సినిమా ముహూర్త కార్యక్రమంతో మొదలు కావాల్సి ఉంది కానీ ఇదే సినిమా నిర్మాణ సంస్థ చేసిన జన నాయగన్ లీక్ కారణంగా తాత్కాలికంగా వాయిదా వేశారు.

మరి ఈ గ్యాప్‌లో అభిమానుల్లో మరింత టెన్షన్ నెలకొంది. ఈ సినిమా త్వరగా స్టార్ట్ చేయాలని వారు కోరుకుంటున్నారు. మరి మేకర్స్ జన నాయగన్ టెన్షన్‌లోనే ఎక్కువ కనిపిస్తున్నారు. మొదట ఆ సినిమా విడుదల చేస్తే తప్ప ఏదీ ఒక కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. సో మెగా 158 ఎప్పుడు మొదలవుతుందో చూడాలి మరి.

# దెయ్యాలు వర్సెస్ పిచ్చోళ్లు



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని డైరెక్టర్ మహి వి రాఘవ్. యాత్ర, ఆనందోబ్రహ్మలాంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ డైరెక్టర్ సేవ్ ది టైగర్స్ సిరీస్‌తో మూవీ లవర్స్‌ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. తాజాగా హార్రర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.

మహి వి రాఘవ్ డైరెక్ట్ చేస్తున్న చిత్రం ఓం శాంతి డిస్కో శాంతి. 'ఆల్‌రెడీ కాషన్ కియా.. ఆల్‌రెడ్డీ' క్యాప్షన్‌తో వస్తోంది. ఇప్పటివరకు దెయ్యాలు మనుషులను భయపెట్టాయి.. కానీ ఆ దెయ్యాలకే భయం పుట్టించే వాళ్లు ఎదురైతే..? అసలు భయమంటే తెలియని పిచ్చివాళ్లు ఈ దెయ్యాల ముందుకొస్తే ఎలా ఉంటుంది? దెయ్యాలు వర్సెస్ పిచ్చివాళ్ల మధ్య జరిగే ఎలిమెంట్స్‌తో సాగే ఫన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతున్నట్టు మోషన్ పోస్టర్‌తో హింట్ ఇచ్చేశాడు.

త్రీ ఆటమ్ లీవ్స్ షో రన్నర్ బ్యానర్‌పై శివ మేక, సాహితి చింతలపూడి నిర్మిస్తున్న చిత్రానికి మహి వి రాఘవ్ కథ, స్క్రీన్ ప్లే కూడా అందిస్తున్నాడు. కృష్ణకుమార్ సంగీతం సమకూరుస్తున్నాడు. రోహిణి, ముక్కు అవినాష్, షకలక శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని సెప్టెంబర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇంతకీ దెయ్యాలు పిచ్చివాళ్లను భయపెట్టగలవా..? లేక పిచ్చివాళ్లే తిరగబడి దెయ్యాల్ని భయపెడతారా..? అనే సన్నివేశాలతో ఊహించని ట్విస్టులతో సాగనున్నట్టు మేకర్స్ హింట్ ఇస్తున్నారు.

### వదిలేయడంలో

# వ్యూహముంది!



ప్రస్తుతం వరుస ఆఫర్స్‌తో దూసుకుపోతున్న బ్యూటీ కయాదు లోహర్ టాలీవుడ్‌లో పలు క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. న్యాచురల్ స్టార్ నాని సరసన ప్రెస్టీజియస్ 'ది ప్యారడైజ్' మూవీలో నటిస్తోంది. అయితే, ఆ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనే విషయంపై ఇప్పటికే మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కాగా, ప్యారడైజ్ చిత్రంతో కయాదు లోహర్‌కు వరుస ఆఫర్లు మిస్ అవుతున్నట్టు తెలుస్తోంది. కయాదు చేతిలో ప్రస్తుతం ఐదుకుపైగా సినిమాలు ఉన్నప్పటికీ, ఆమె కొత్త ప్రాజెక్టులపై సంతకం చేయకపోవడానికి ప్రధాన కారణం 'ది ప్యారడైజ్'. ఈ సినిమా ఒప్పందం ప్రకారం, షూటింగ్ ఎప్పుడున్నా ఆమె అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. దీనివల్ల ఆమె కాల్షీట్లు సర్దుబాటు చేయడం కష్టంగా మారింది. కొన్ని నిర్మాణ సంస్థలు ఆమె ఇబ్బందిని అర్థం చేసుకున్నప్పటికీ, మరికొందరు డేట్స్ సమస్య కారణంగా ఆమెను తీసుకోవడానికి వెనకాడుతున్నారు. అయినప్పటికీ, 'ది ప్యారడైజ్'వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం ఆమె ఇన్ని అవకాశాలను వదులుకోవడం వెనుక పెద్ద ప్లానే ఉంది. ఈ సినిమా కోసం ఆమెకు భారీ రెమ్యునరేషన్ అందినట్టు సమాచారం. ఒకవేళ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధిస్తే, కయాదు లోహర్ కెరీర్ మరోస్థాయికి చేరుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ప్యారడైజ్ మూవీపై కయాదు లోహర్ భారీ అంచనాలు పెట్టుకున్న మాట మాత్రం వాస్తవం.

# పూరీ సార్.. మీరు సూపర్



*పవర్ ఫుల్ మాస్ డైలాగ్స్‌తో మెసేజ్‌తోపాటు ఎంటర్‌టైన్‌మెంట్ అందించే డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు పూరీ జగన్నాథ్. పవన్‌కల్యాణ్, రవితేజ, మహేశ్‌బాబు, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఇలా ఎంతోమందికి బ్రేక్ ఇవ్వడమే కాదు ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టాడు ఈ డాషింగ్ డైరెక్టర్. "సిటీకి ఎంతోమంది కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. చంటిగాడు లోకల్..", "ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా బుల్లెట్ దిగిందా లేదా..?", "పది మందిని మోసం చేస్తే ఎంతో కొంత బాగుపడతావ్.. నిన్ను నువ్వు మోసం చేసుకుంటే సంకనాకి పోతావ్..", "రేప్ చేశామని ఒప్పుకునే దమ్ము మాకుంది.. మమ్మల్ని శిక్షించే ధైర్యం మీకుందా..?" అంటూ క్లాస్, మాస్ ఆడియెన్స్‌కు కనెక్టయ్యే డైలాగ్స్ ఎన్నో రాసి ప్రేక్షకులను ఓలలాడించడం ఒక్క పూరీకే సాధ్యం. ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్స్ హిట్లతో వన్ ఆఫ్ ది లీడింగ్ డైరెక్టర్లలో ఒకరిగా నిలిచిన పూరీ.. సినీ పరిశ్రమలోకి ఎంట్రీఇచ్చి 26ఏళ్లు. ఈ సందర్భంగా పూరీతో కలిసి పనిచేస్తున్న యాక్టర్ విజయ్‌సేతుపతి ఓ మెసేజ్‌ను అందరితో పంచుకున్నాడు. "సినిమాతో 26 ఏండ్లుగా ప్రయాణం సాగించడం కేవలం మైల్‌స్టోన్ మాత్రమే కాదు.. ఇది ధైర్యం, ధృఢ విశ్వాసం, నిర్భయమైన స్వరంతో నిర్మించబడ్డ వారసత్వం. ప్రియమైన పూరీ సార్ మీతో 'స్లమ్ డాగ్-33 టెంపుల్ రోడ్'కు పనిచేయడం ఆనందంగా ఉంది. యాక్టర్లుగా మేము ఎప్పుడూ మమ్మల్ని నమ్మి సౌకర్యవంతమైన జోన్లను దాటి చూపించే దర్శకుల కోసం ఎదురుచూస్తుంటాం. మీరు ఆ పనిని అవిశ్రాంతంగా పూర్తి చేశారు. ఈ సినిమా కోసం పనిచేస్తున్న మాకందరికీ స్లమ్ డాగ్-33 టెంపుల్ రోడ్ చాలా ప్రత్యేకమైనదిగా గుర్తు పెట్టుకునేలా ఉంటుంది. ప్రభావవంతమైన స్టోరీ టెల్లింగ్‌తో మీ విజయ పరంపరను కొనసాగించాలని ఆశిస్తున్నానని.. పూరీతో లొకేషన్‌లో తీసిన వర్కింగ్ స్టిల్స్‌ను షేర్ చేస్తూ ట్వీట్ చేశాడు విజయ్ సేతుపతి.*